ఈనాడు కర్నూలు

మంగళవారం అక్టోబరు 15, 2024

పురాలకు అమృత్ ఫలాలు

■ పైపులైన్ల విస్తరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు నిధులు



మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు కేటాయించిన నిధులు (రూ.కోట్లలో) ● పురపాలకం ● నిధులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పురపాలక సంఘాల్లో ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించడంలో భాగంగా ప్రజారోగ్య శాఖ రూపొందించిన వివిధ ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.627.81 కోట్ల వ్యయంతో నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయాలని పాలకులు నిర్ణయించారు. ఆయా పురపాలక సంఘాల నుంచి వచ్చిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే :

లబ్ధి పొందని ప్రాంతాల్లో..

అమృత్ 2.0 కింద ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు వివిధ పురపాలక సంఘాల్లో పైపులైన్ల విస్తరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇప్పటికే అమృత్ పథకం కింద మున్సిపాలిటీల్లో మంచినీటి పథకాలు, పైపులైన్ల నిర్మాణం జరుగుతోంది. ఈ పనులకు కొనసాగింపుగా అమృత్ 2.0 కింద కొత్తగా పైపులైన్లను విస్తరించి పథకం-1 కింద లబ్ధి పొందని ప్రాంతాల్లో పనులు చేపట్టనున్నారు.

పైపులైన్ల నిర్మాణాలకు అధనం

గతంలో అమృత్ పథకం కింద కర్నూలు, నంద్యాల, ఆదోని పట్టణాలకు నిధులు ప్రతిపాదించారు. మిగతా మున్సిపాల్టీల్లో ఏడీబీ నిధుల కింద పైపులైన్లు, మంచినీటి ట్యాంకుల నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించి ఆ మేరకు పనులు కూడా ప్రారంభించారు. ప్రస్తుతం అమృత్ 2.0 కింద ఆయా మున్సిపాల్టీల్లో పథకం-1 కింద ఎంపికవని ప్రాంతాలకు ప్రస్తుతం ప్రత్యేకంగా నిధులను ప్రతిపాదించారు. ప్రత్యేకించి వీకర్ సెక్షన్ ప్రాంతాలతోపాటు మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు ఈ నిధులను ప్రతిపాదించారు.

నీటి సరఫరాకు కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)

పురపాలకం	మొత్తం
బేతంచెర్ల నగర పంచాయతీ	45.00
బేతంచెర్ల వీకర్ సెక్షన్ కాలనీ	2.66
నంద్యాల-I	32.94
నంద్యాల వీకర్ సెక్షన్	10.47
నీటి సరఫరా, పైపులైన్ల విస్తరణ	
నందికొట్కూరు వీకర్ సెక్షన్	10.18
ఆత్మకూరు వీకర్ సెక్షన్	9.66
డోన్ మున్సిపాలిటీ	23.56
కర్నూలు నగరపాలక సంస్థ	131.00

డీపీఆర్ రూపొందించి..

అమృత్ 2.0 కింద కర్నూలు నగరపాలక సంస్థకు సింహభాగం నిధులు కేటాయించారు. కర్నూలు నగరంలో 52 డివిజన్ల పరిధిలో 6 లక్షలకుపైగా జనాభా నివసిస్తున్నారు. ప్రతిరోజూ 120 ఎంఎల్‌డీ నీటి అవసరం ఉంది. ప్రస్తుతం 95 ఎంఎల్‌డీ వరకే సరఫరా జరుగుతోంది. జనాభా అవసరాలకు తగ్గట్లుగా నీటి సరఫరా లేదు. ఈ నేపథ్యంలో కొత్తగా డీపీఆర్ రూపొందించి పైపులైన్ల విస్తరణ పనులకు రూ.131 కోట్లు కేటాయించారు. మరోవైపు మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి రూ.115 కోట్లు కేటాయించారు. ఆదోనిలో మురుగునీటి శుద్ధి ప్లాంటుకు రూ.116.23 కోట్లు, నంద్యాలకు రూ.103.64 కోట్లు కేటాయించారు. వీటి నిర్మాణాలు పూర్తయితే వృథా నీటిని శుద్ధిచేసి ఇతర అవసరాలకు వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది.

తుంగభద్రకు వరద ఉద్ధృతి

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే: గత రెండు రోజులుగా తుంగభద్ర నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి 82,503.95 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. నీటి నిల్వ సామర్థ్యం 101.66 టీఎంసీలుగా ఉంది. ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన కౌతాళం మండలం మేళిగనూరు వద్ద తుంగభద్ర నదిలో సుమారు 85 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. కోసిగి మండలంలోని ఆర్డీఎస్ వద్ద వరదనీరు ఉద్ధృతంగా ఉంది. మరోవైపు నదిలోకి ఎవరూ వెళ్లకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.


కోసిగి మండలం ఆర్డీఎస్ వద్ద ప్రవహిస్తున్న వరద నీరు

92,950 క్యూసెక్కుల ప్రవాహం

గూడూరు న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి 92,950 క్యూసెక్కుల వరద నీరు వస్తోందని జలాశయ ఇంజినీరు రాజు సోమవారం తెలిపారు. 22 గేట్లు ఎత్తి 92,034 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తీర గ్రామాల ప్రజలు నదిలోకి వెళ్లకూడదని సూచించారు.

జిల్లాలో రూ.82 కోట్లతో అభివృద్ధి పనులు

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా పల్లె పండగను ప్రభుత్వం నిర్వహిస్తోందని.. జిల్లాలో రూ.82 కోట్లతో 1,562 పనులకు శ్రీకారం చుట్టామని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా ఇందిరమ్మ కాలనీకి మంజూరైన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో కలిసి సోమవారం భూమి పూజ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గొందిపర్ల గ్రామంలో రూ.41.62 లక్షలతో వివిధ పనులకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద మొదటి దశలో వీటిని మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పనులు నిరంతరంగా సాగుతాయని చెప్పారు. గ్రామాలకు మొదట రహదారులు అవసరమని.. ఈ నేపథ్యంలో మొదటి దశలో ముందుగా రోడ్ల నిర్మాణంతోపాటు గోకులాలను కూడా పూర్తి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ గ్రామంలో ఏవైనా పనులు అవసరమైతే ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొస్తే వాటిని సైతం చేపడుతామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ముందుకెళుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసర రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, డీపీవో భాస్కర్, సర్పంచి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజలో కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

లాటరీ.. వరించింది

■ ముగిసిన మద్యం దుకాణాల అనుమతుల ప్రక్రియ


లాటరీ తీసి చూపుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, పక్కన జేసీ నవ్య

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లాలో 99 మద్యం దుకాణాల అనుమతులకు సంబంధించిన ఖరారు ప్రక్రియ సోమవారం ముగిసింది. అనుమతి దక్కించుకున్న వారు ఆనందంలో మునిగిపోగా.. దక్కనివారు నిరాశతో వెనుదిరిగారు. కర్నూలులోని జడ్పీ కార్యాలయంలో కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ నవ్య సమక్షంలో లాటరీ విధానంలో అనుమతుల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలో మొత్తం 3,046 దరఖాస్తులు వచ్చిన సంగతి విదితమే. గెజిట్ నంబరు 1 ప్రకారం ఒక్కో దుకాణానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అన్ని నంబర్ల టోకెన్లను డబ్బాలో వేశారు. అందులో వరుసగా మూడు టోకెన్లు తీశారు. మొదటి వ్యక్తికి అనుమతి కేటాయించారు. మరో ఇద్దరిని ఆర్1, ఆర్2గా రిజర్వ్‌లో ఉంచారు. వరుసగా కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, కోసిగి, ఆలూరు, పత్తికొండ స్టేషన్ల పరిధిలోని దుకాణాలకు అనుమతులు ఖరారు చేశారు. సోమవారం ఉదయం 8 గంటలకు మొదలైన ప్రక్రియ మధ్యాహ్నం 2.10 గంటల వరకు సాగింది. శిక్షణ ఐఏఎస్ చల్లా కల్యాణి, మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, పర్యవేక్షణాధికారి సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, శ్రీనివాసాచారి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు. మద్యం దుకాణాల అనుమతుల కేటాయింపు ప్రక్రియ ఎన్నికల వాతావరణాన్ని తలపించింది.

● కోడుమూరు స్టేషన్ పరిధిలో ఇరువర్గాల ప్రజాప్రతినిధులు కలిసి 129 దరఖాస్తులు ఇవ్వగా.. ఆరు దుకాణాలు దక్కించుకున్నారు. కర్నూలుకు చెందిన ఓ తెదేపా నేత 10 దరఖాస్తులు ఇవ్వగా ఒక దుకాణానికి అనుమతి దక్కింది. పాణ్యం తెదేపా వర్గీయులు 50 దరఖాస్తులు ఇవ్వగా 5 దుకాణాలు దక్కాయి. ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని పరిధిలో సిండికేట్లు అనుమతులు దక్కించుకున్నారు.

నాడు గుమస్తాగా..

ఓర్వకల్లు పరిధిలో లక్ష్మీ ప్రతాప్ అనే వ్యక్తి గతంలో గోనెగండ్ల ప్రాంతంలోని మద్యం దుకాణంలో విధులు నిర్వహించేవారు. ఇతను ఓర్వకల్లు మండల పరిధిలోని దుకాణానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నగరంలోని జడ్పీలో లాటరీ తీయగా ఆయనకు మద్యం దుకాణం వరించింది.

రూ.10.59 కోట్ల ఆదాయం

అనుమతులు దక్కించుకున్నవారు ఈనెల 16 నుంచి 2026, సెప్టెంబరు 30 వరకు నిర్వహించుకోనున్నారు. తొలి విడతగా వార్షిక రుసుములో ఆరో వంతు చెల్లించారు. ప్రభుత్వానికి 99 దుకాణాల నుంచి రూ.10.59 కోట్ల ఆదాయం సమకూరింది.


బయట నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు



మహిళలకు 10 దుకాణాలు

99 మద్యం దుకాణాల అనుమతుల్లో 10 దుకాణాలు మహిళలకు దక్కాయి. ఇందులో ఇద్దరికి రెండు చొప్పున రావడం విశేషం. కర్నూలు స్టేషన్ పరిధిలో వెంకట సబ్బమ్మకు 16వ నంబరు, కోడుమూరు పరిధిలో లక్ష్మీదేవి (తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా ఎర్రవల్లి)కి 35, 36వ నంబరు, వెంకటేశ్వరమ్మకు 38, కోసిగి స్టేషన్ పరిధిలో పావనికి 74, పత్తికొండ పరిధిలో సుజలకు 86, 88వ నంబరు, రమకు 91, గోనెగండ్ల పరిధిలో అనితకు 96, అంబమ్మకు 98వ నంబరు దుకాణాలు దక్కాయి. నాగలాపురం పరిధిలోని దుకాణానికి 99 మంది దరఖాస్తు చేసుకోగా అందులో లక్ష్మీదేవికి లభించడం విశేషం. అత్తాకోడళ్లైన అంబమ్మ, అనితకు రెండు దుకాణాలు దక్కాయి.

● నలుగురికి రెండేసి దుకాణాలు లభించాయి. కర్నూలులో నాగరాజు, ఎమ్మిగనూరు పరిధిలో విజయ్ కుమార్, కోడుమూరు స్టేషన్ పరిధిలో లక్ష్మీదేవి, పత్తికొండ పరిధిలో సుజలకు రెండు చొప్పున మద్యం దుకాణాలు రావడం విశేషం.

హతవిధి



కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే : రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన జలాశయాల్లో శ్రీశైలం ఒకటి. దీని గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు. దీని కింద లక్షలాది ఎకరాలు సాగవుతున్నాయి. ఇంతటి కీలకమైన ప్రాజెక్టును ఇంజినీర్ల కొరత వేధిస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తోంది. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ప్రాజెక్టుకు సంబంధించి పెద్దఎత్తున నిధులు సమకూరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పనులను పర్యవేక్షణ చేయాల్సిన నిపుణులైన ఇంజినీర్లు లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

భారీగా నిధుల కేటాయింపు

శ్రీశైలం ప్రాజెక్టును ఏళ్ల తరబడి ప్లంజ్‌పూల్ సమస్య వేధిస్తోంది. ఫలితంగా జలాశయానికి పెనుముప్పు ఉందని.. దీనిని వెంటనే పూడ్చేలా చర్యలు తీసుకోవాలని నిపుణులు హెచ్చరించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో జల వనరుల శాఖ అధికారులు నిధుల కోసం నివేదికలు సమర్పించినా పట్టించుకోలేదు. డ్యామ్‌కు ముప్పు పొంచి ఉందని విన్నవించినా తీసుకున్న చర్యలు శూన్యమే. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జలాశయంపై దృష్టి సారించింది. ప్లంజ్‌పూల్ సమస్యకు సంబంధించి సర్వే చేసేందుకు ఇటీవల రూ.14.70 కోట్లు విడుదల చేసింది. మరోవైపు డ్రిప్ పథకం కింద ప్రపంచ బ్యాంకు నిధుల విడుదలకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఈనెల 7న ప్రపంచ బ్యాంకు అధికారులు శ్రీశైలం జలాశయాన్ని సందర్శించారు. అనంతరం ఆధునికీకరణకు రూ.104 కోట్ల రుణం ఇచ్చేందుకు అంగీకరించారు. ఇలా నిధులు పూర్తిస్థాయిలో సమకూరుతున్నా.. పర్యవేక్షణకు అవసరమైన ఇంజినీర్లు అందుబాటులో లేరు.

ఇక్కడికొచ్చేందుకు విముఖత

శ్రీశైలం జలాశయం వద్ద విధులు నిర్వహించేందుకు పలువురు సుముఖత వ్యక్తం చేయడం లేదన్న విమర్శలున్నాయి. అటవీ ప్రాంతం కావడంతో పాటు అవసరమైన వసతులు లేకపోవడంతో చాలామంది ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి నెలకొనడంతో గత నెలలో శ్రీశైలం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి జల వనరుల శాఖ ఈఎన్‌సీకి లేఖ రాశారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం దృష్టిసారించి అవసరమైన ఇంజినీర్లను నియమించి ప్రాజెక్టు పరిరక్షణకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

పోస్టుల భర్తీ ఎన్నడో..

శ్రీశైలం జలాశయంలో ఎస్ఈగా శ్రీరామచంద్రమూర్తి రెండేళ్ల కిందట బాధ్యతలు చేపట్టారు. డ్యామ్ పరిధిలో ముగ్గురు ఈఈలకు గాను రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల ఇద్దరు ఈఈలను నియమించినా ఇప్పటి వరకు విధుల్లో చేరలేదు. 11 మంది డీఈఈలకు గాను ఇద్దరే ఉండటం గమనార్హం. ఏఈఈలు 44 మందికిగాను 9 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఉన్న 9 మంది ఏఈఈల్లో ఐదుగురు ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం 40 పోస్టులు ఖాళీగా ఉండటం గమనార్హం. ఫలితంగా ఎక్కడి పనులక్కడే నిలిచిపోయే పరిస్థితి నెలకొంది.

● జలాశయానికి ఈ ఏడాది 1,020 టీఎంసీలకుపైగా వరదనీరు వచ్చింది. ఇంజినీర్ల కొరత నేపథ్యంలో ఇతర సర్కిళ్ల నుంచి డిప్యుటేషన్లపై పలువురికి కొద్దిరోజుల పాటు బాధ్యతలు అప్పగించారు. పూర్తిస్థాయిలో నియమించకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

కనిపిస్తే కాజేస్తారు.. అనుకున్నది చేసేస్తారు

■ రెవెన్యూ సంఘం కీలక నాయకుడి నిర్వాకం



కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఆయన తలుచుకుంటే చాలు.. అర్హత లేకపోయినా ఇళ్ల పట్టాలు మార్చేస్తారు.. సిబ్బందిని వ్యక్తిగత పనులకు పురమాయిస్తారు.. బదిలీలు మొదలయ్యాయంటే ఆదాయాల పండగే.. నెలల తరబడి పనులు చేయకపోయినా వేతనం రూపాయి కూడా తగ్గదు.. కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలు జారీ చేయాలన్నా ఆయన పాత్ర తప్పనిసరి.. అక్రమాలకు చిరునామాగా మారారంటూ రెవెన్యూ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● తన తండ్రి మరణానంతరం కారుణ్య నియామకం కింద జూనియర్ సహాయకుడిగా చేరారు. ఆ తర్వాత కలెక్టరేట్‌లో పనిచేస్తూ కీలక విభాగాల్లో పనిచేసి తన చేతివాటం ప్రదర్శించారు. రెవెన్యూ ఉన్నతాధికారులను మచ్చిక చేసుకొని దందా కొనసాగించారు. దశాబ్దం కిందట డోన్ తహసీల్దారు కార్యాలయంలో పనిచేసే సమయంలో అర్హులైన వేల ఓట్లను జాబితా నుంచి తొలగించారన్న ఫిర్యాదులు అందడంతో ఎన్నికల కమిషన్ విచారణకు ఆదేశించింది. వాస్తవమని తేలడంతో ఆయన సర్వీసు రిజిస్టరులో రిమార్క్స్ రాశారు. ఫలితంగా రెండు ఇంక్రిమెంట్లు కోత విధించారు.

సంఘాన్ని అడ్డుపెట్టుకుని..

పదోన్నతిపై గతంలో కోడుమూరు ఉప తహసీల్దారుగా కొంతకాలంపాటు పనిచేశారు. అక్కడ రెవెన్యూ సిబ్బందిని వేధింపులకు గురిచేసేవారన్న ఆరోపణలున్నాయి. కోడుమూరులో ఉంటూ రెవెన్యూ సంఘానికి ఎన్నికలు నిర్వహించేందుకు నాలుగైదు నెలల పాటు విధులకు రాకుండా ప్రచారం చేశారనే విమర్శలున్నాయి. రెవెన్యూ సంఘంలో కీలక నాయకుడిగా మారారు. సంఘాన్ని అడ్డుపెట్టుకుని ఒకేచోట సుమారు ఐదేళ్ల పాటు కొనసాగారు. ప్రస్తుతం కర్నూలు రూరల్ తహసీల్దారు కార్యాలయం నుంచి అర్బన్ కార్యాలయానికి ఓ దస్త్రం మార్చేందుకు రూ.8 లక్షలు డిమాండ్ చేసినట్లు రెవెన్యూ ఉద్యోగులు చెబుతున్నారు.

కార్యదర్శుల బదిలీలపై విచారణ

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల పరిధిలో కొందరు కార్యదర్శులు, ఈవోఆర్డీల బదిలీల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై విచారణ చేపట్టాలని పంచాయతీరాజ్‌శాఖ కమిషనరు కృష్ణతేజ ఆదేశించారు. జిల్లాలో బదిలీలకు సంబంధించి విచారణ బాధ్యతలను డీఆర్వో చిరంజీవికి అప్పగిస్తూ కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశించారు. ఈ నేపథ్యంలో డీపీవో కార్యాలయంలోని బదిలీల దస్త్రాలను పరిశీలిస్తున్నారు. సిఫార్సుల మేరకు బదిలీలు చేశారా? ఇతర కారణాలతో చేశారా.. అన్న కోణంలో పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నట్లు తెలిసింది. బదిలీలకు సంబంధించి డీపీవో కార్యాలయంలో ఎంతమంది ఉద్యోగులు బాధ్యత వహించారనే అంశాలపై ఆరా తీస్తున్నారు. డిప్యుటేషన్లు ఎవరి ప్రమేయంతో కొనసాగించారు.. బదిలీలకు కారణాలు, నిబంధనల మేరకు చేశారా.. పాత తేదీ వేసి సంతకాలు చేయించారా? అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది.



కనులపండువగా రథోత్సవం

హొళగుంద, న్యూస్‌టుడే : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన దేవరగట్టులో భక్తజనుల మధ్య మాళ మల్లేశ్వర స్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. మండల పరిధిలోని దేవరగట్టు కొండ గుహలో వెలసిన మూల విరాట్‌లకు వేకువజామునే ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అశేష భక్తజనుల మధ్య మేళతాళాలు, బీరప్పడోలు, గొరవయ్య ఆటపాటల నడుమ రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నుంచేకాక కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్ ఆధ్వర్యంలో హొళగుంద ఎస్సై బాల నరసింహులు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

వైభవంగా పవిత్రోత్సవాలు

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలంలో పవిత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఎగువ అహోబిలంలో సోమవారం జ్వాలా నృసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను అలంకరించి పవిత్రాలను ధరింపజేశారు. హోమ మండపంలో స్వామి, అమ్మవార్లకు ఎదురుగా హోమగుండంలో హోమం నిర్వహించారు.

టెట్‌కు 527 మంది గైర్హాజరు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: టెట్‌కు 527 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు ఇన్‌ఛార్జి డీఈవో శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఉదయం సెషన్‌కు 1,508 మందికి గాను 1,374 మంది, మధ్యాహ్న సెషన్‌లో 2,464 మందికి గాను 2,071 మంది పరీక్ష రాసినట్లు చెప్పారు.

చేనేతకు ఆదారమేదీ!

■ గతంలో మూడు క్లస్టర్ల మంజూరు ■ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్పందిస్తే ఎందరికో లబ్ధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు, కోడుమూరు, గూడూరు, గోనెగండ్ల, నాగలదిన్నె, నందవరం, నంద్యాల, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో చేనేత వృత్తిపై ఆధారపడి జీవించేవారు అధికంగా ఉన్నారు. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో 31 వేలకుపైగా చేనేత కుటుంబాలు ఉండేవి. కష్టానికి తగ్గ ప్రతిఫలం లేకపోవడంతో చాలామంది ఈ వృత్తికి దూరమయ్యారు. ప్రస్తుతం 20 వేల మగ్గాలున్నాయి. వీటిపై ఎక్కువగా పట్టుచీరలు, సిల్క్, చేనేత వస్త్రాలు, దుప్పట్లు, తువ్వాళ్లు, గద్వాల పట్టు, ధర్మవరం సిల్క్ వంటివి తయారు చేస్తున్నారు. వీరంతా మాస్టర్ వీవర్స్ కింద పనిచేస్తూ కూలీపై ఆధారపడి జీవిస్తున్నారు. ఒక్కో చేనేత మగ్గానికి కనీసం రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి అవుతుండటంతో కార్మికులు సొంతంగా ఏర్పాటు చేసుకోలేకపోతున్నారు. క్లస్టర్ ద్వారా వస్తే సొంతంగా మగ్గాలు, ముడిసరకు, నేసిన చీరలకు సొంతంగా మార్కెటింగ్ చేసుకునేందుకు అవకాశముంది.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే :



ఎంతో మేలు జరుగుతుంది

– శంకరన్న, చేనేత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎమ్మిగనూరు



ప్రస్తుతం మారుతున్న సమాజానికి అనుగుణంగా చేనేత కార్మికులు చీరలు నేస్తున్నారు. క్లస్టర్ మంజూరు చేస్తే బ్యాంకు రుణాలు, రాయితీపై ముడి సరకు లభిస్తుంది. క్లస్టర్లు మంజూరు చేయకపోవడంతో రానురాను కార్మికుల సంఖ్య తగ్గిపోతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు కనీసం నాలుగైదు క్లస్టర్లు మంజూరు చేయాలి.

వైకాపా ప్రభుత్వం పట్టించుకోక..

ఎమ్మిగనూరు, గుడేకల్లు, ఆదోని, కోడుమూరు, ఎమ్మిగనూరు-2 కింద ఐదు క్లస్టర్లు మంజూరు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. గతంలో ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని ప్రాంతాల్లో మూడు క్లస్టర్లు మంజూరయ్యాయి. పేరుకే క్లస్టర్ తప్ప కార్మికులకు పెద్దగా యంత్రాలు ఏవీ అందలేదు. ఈ నేపథ్యంలో 2019లో మళ్లీ మూడు క్లస్టర్లు ప్రతిపాదనలు పెట్టారు. వైకాపా ప్రభుత్వం కొత్త క్లస్టర్ల గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుతం ఏర్పాటు చేయనున్న పది క్లస్టర్లలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు కేటాయించలేదు.

రాయితీపై ఆధునిక పరికరాలు

కార్మికులకు తక్కువ వడ్డీకి రుణాలు అందుతాయి. మరోవైపు ముడి సరకు తక్కువ ధరకు లభిస్తుంది. ప్రతి చేనేత కుటుంబానికి ఉచితంగా ఆరోగ్య సేవలు సమకూరుతాయి. వారి పిల్లలకు ఉచిత విద్యా బోధన అందుతుంది. 90 శాతంతో ఆధునిక పరికరాలు మంజూరయ్యే అవకాశముంటుంది. 90 శాతం రాయితీలో మోటార్‌వైజ్డ్ జకార్డు, ఫ్రేం మగ్గం, జకార్డు యంత్రాలు, నూలు చుట్టే యంత్రాలు వంటివి ఆధునిక పరికరాలు అందుతాయి.

రూ.1.80 లక్షల పెట్టుబడి..

రూ.3 లక్షల ఆదాయం



చౌళకాయలను చూపుతున్న రైతు మద్దిలేటి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన రైతు మద్దిలేటి నాలుగెకరాల పొలంలో చౌళకాయ సాగు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. విత్తనం వేసే ముందు సేంద్రియ పద్ధతిలో భూసారాన్ని పెంచారు. పొలంలో ఆరు రోజులపాటు గొర్రెల మందలను ఏర్పాటు చేయించారు. గొర్రెల మందలు నిలిపేందుకు కాపరికి రోజుకు రూ.5 వేలు చొప్పున ఖర్చు వచ్చిందన్నారు. స్పిక్ రకానికి చెందిన చౌళకాయ విత్తనాలను కోడుమూరులో ప్యాకెట్ రూ.650 చొప్పున కొన్నారు. ఎకరానికి 7 ప్యాకెట్ల లెక్కన వేసుకున్నారు. సేద్యానికి రూ.30 వేలు ఖర్చు చేశారు. నెలకు రూ.15 వేల చొప్పున మందులు, సాగుకు వ్యయమైందన్నారు. 60 రోజులకు దిగుబడి మొదలైంది. పెట్టుబడి, కూలీలు కలిపి రూ.1.80 లక్షలు అయ్యింది. కోతకు 42 సంచులకుపైగా దిగుబడి వస్తుంది. ఒక సంచి 75 కిలోలు ఉంటుంది. కర్నూలు, హైదరాబాద్‌కు తరలిస్తూ విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు ఏడు కోతలకు రూ.3 లక్షలు ఆదాయం వచ్చినట్లు మద్దిలేటి తెలిపారు.

ఉల్లి నారు.. డిమాండు జోరు



ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉల్లి సాగులో గోనెగండ్ల, కోడుమూరు, కౌతాళం, కోసిగి, సి.బెళగల్, ఎమ్మిగనూరు మండలాలు ప్రసిద్ధి. ప్రస్తుతం ఉల్లికి మద్దతు ధర ఆశాజనకంగా ఉండటంతో ఉల్లి నారుకు డిమాండు పెరిగింది. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల తోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల రైతులు నారు కొనుగోలుకు గోనెగండ్లకు వస్తున్నారు. గత నెలలో కురిసిన అధిక వర్షాలకు ఉల్లి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీనికితోడు పంట దిగుబడులు కూడా పెద్దగా లేవు. ఉల్లి పంటకు మరింత డిమాండు పెరుగుతుండటంతో రైతులు ముందస్తు రబీ కింద ఉల్లి సాగు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఒక ఉల్లి నారుమడి రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు పలుకుతోంది. ఉల్లి నారుతో ఎకరానికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు లాభాలు పొందినట్లు తెలిపారు.

– న్యూస్‌టుడే, గోనెగండ్ల

సమస్య సమాధానాలు

బనగానపల్లి, న్యూస్‌టుడే:

సమస్య: వరిలో ఆకులపై మధ్యలో గోధుమ రంగు అంచుతో బూడిద రంగు మచ్చలు వస్తున్నాయి. – వెంకటేశ్వరరెడ్డి, నందవరం



ధనలక్ష్మి, శాస్త్రవేత్త

సమాధానం: దీన్ని అగ్గి తెగులు, మెడ విరుపు తెగులు అంటాం. ఈ తెగులు పిలకల కణుపుల వద్ద ఆశిస్తే పిలక వాలిపోతుంది. మెడ భాగంలో ఆశిస్తే వెన్ను విరిగి వాలిపోతుంది. వెన్నులో తాలుగింజలు లేదా సగం నిండిన గింజలు వస్తాయి. నివారణకు తెగులును తట్టుకునే రకాలు సాగు చేయాలి. 1.3 కిలోల కార్బండిజమ్‌ను లీటర్ నీటికి పొడి కలిపి విత్తనశుద్ధి చేయాలి. తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 75 శాతం, 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథయులెన్ 40 శాతం 1.5 మి.లీ లేదా కాసుగామైసిన్ 3 ఎల్ 2.5 మి.లీ, లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. నత్రజని ఎరువును ఎక్కువగా వాడాలి. పొలంలో నీరు లేకుండా ఆరబెట్టాలి.

సమస్య: కందిలో మొక్కలు ఎండిపోతున్నాయి. వాటిని పీకి కాండం మొదలు భాగం చీల్చి పరిశీలిస్తే గోధుమ రంగు నిలువు చారలు కనిపిస్తున్నాయి. నివారణ తెలపండి. – రామచంద్రారెడ్డి, పసుపుల

సమాధానం: దీన్ని ఎండు తెగులు అంటారు. పంట మార్పిడి చేయకపోవడంతో ఈ తెగులు ఎక్కువగా సోకుతుంది. ఒకే పైరును ఏళ్ల తరబడి వేయరాదు. విత్తుకునే ముందు తప్పనిసరిగా కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్‌గాని మాంకోజెబ్‌గాని పట్టించి విత్తుకోవాలి. నివారణకు 80 కిలోల పశువుల ఎరువు, 20 కిలోల వేపపిండిలో కలిపి రెండు కిలోల ట్రైకోడెర్మావిరిడి జీవ శిలీంద్రాన్ని ఎకరానికి భూమిలో కలియదున్నాలి.

శనగకు అనుకూలం



ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: అక్టోబరు 15 నుంచి శనగ సాగుకు అనుకూలం. జేజీ 11, నంద్యాల గ్రామ్ 452, నంద్యాల గ్రామ్ 857, 776, 49 రకాలు అనువైనవి. విత్తే ముందు కిలో విత్తనానికి 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడి లేదా 2 గ్రా. కార్బండిజమ్‌తో శుద్ధి చేసుకోవాలి. మధ్యస్థ లావు గింజలైతే 30-35 కిలోలు, లావు రకాలైతే 45-50 కిలోలు ఎకరానికి విత్తుకోవాలి.

రైతేరాజు

మొక్కజొన్నలో అప్రమత్తతతో తెగుళ్ల నివారణ

బనగానపల్లి, న్యూస్‌టుడే: రైతులు మొక్కజొన్న పంట విషయమై అప్రమత్తంగా ఉంటే తెగుళ్ల నివారణ చేసుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత ఎం.బాలరాజు సూచించారు. సాధారణంగా మొక్కజొన్నలో తుప్పు తెగులు, పూత దశ అనంతరం బొగ్గుకుళ్లు తెగులు కనిపిస్తాయన్నారు.



పంట పెరిగాక ఆకులపై పొక్కులు గోధుమ వర్ణం నుంచి నలుపు రంగుకు మారుతాయి. దీన్ని తుప్పు తెగులు అంటాం. అలాగే నేలలో తేమ శాతం తగ్గడంతో బొగ్గుకుళ్లు తెగులు వస్తుంది. నేలలోని శిలీంద్రం మొక్కల వేర్ల ద్వారా కాండం పైభాగానికి వ్యాపిస్తుంది. కాండంపై గోధుమ రంగు చారలు వస్తాయి. ఈ తెగులుతో పంట కోత దశకు రాకముందే కాండం భాగం విరిగిపోయి మొక్కలు నేలపై పడుతాయి. ప్రస్తుతం అక్కడక్కడ ఈ తెగులు కనిపిస్తోంది. మరో నెల రోజులు దాటితే పంట కోతకు వస్తుంది. ఈ తెగులుతో అప్రమత్తంగా ఉండాలి. కోత దశకు ముందు మొక్కలు నేలపై వాలకుండా చూసుకుంటే మంచి దిగుబడి సాధించే అవకాశముంటుంది.

విత్తనశుద్ధితో మేలు

తుప్పు తెగులు నివారణకు మాంకోజెబ్ ఎకరానికి 500 గ్రాములు 200 లీటర్ల నీటికి కలిపి తెగులు తీవ్రతను బట్టి ఒకటి లేదా రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. విత్తే ముందు కిలో విత్తనానికి 2.5 గ్రాముల మాంకోజెబ్ శిలీంద్రంతో విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి.

బొగ్గు కుళ్లుతో..

పూత దశ నుంచి నేలలో తేమ శాతం తగ్గకుండా ఉండేలా నీటి తడులు పెట్టుకోవాలి. ఎకరానికి అదనంగా 30 కిలోల పొటాష్ వేయాలి. తెగులు ఎక్కువగా సోకే ప్రాంతంలో పంట వేసే ముందు పచ్చిరొట్ట పైరును సాగు చేసి నేలలో కలియదున్నాలి. ట్రైకోడెర్మా శిలీంద్రాన్ని పశువుల ఎరువులో వృద్ధి చేసి మూడు, నాలుగేళ్లు వరుసగా నేలతో కలుపుతూ పోవాలి. పంట మార్పిడి అవలంబించాలి.

అపార్‌మైన సదుపాయాలు

☛ విద్యార్థులకు డిజిటల్ కార్డులు ☛ 9 నుంచి 12 తరగతుల వారికి ఇవ్వాలని నిర్ణయం

డోన్‌పట్టణం, కర్నూలువిద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు శాశ్వత విధానంలో గుర్తింపు సంఖ్యతో ప్రత్యేక నంబరును కేటాయించే ప్రక్రియను కేంద్రం అమలు చేయనుంది. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆధార్ తరహాలో 'వన్ నేషన్.. వన్ స్టూడెంట్' నినాదంలో భాగంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు ప్రత్యేక నంబరు (గుర్తింపు సంఖ్య)ను ఇవ్వనున్నారు. పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయడంతో కార్యాచరణకు కసరత్తు ప్రారంభించారు.

మొదటి దఫాలో ఇలా..

ఆధార్ తరహాలో గుర్తింపు సంఖ్యను కేటాయించేందుకు 9 నుంచి 12 తరగతుల విద్యార్థుల వివరాలను యూ డైస్ ప్లస్‌లో అప్‌లోడ్ చేస్తారు. పాఠశాల నుంచి ఉన్నత చదువుల వరకు



అపార్ కార్డు నమూనా

విద్యార్థుల పేరు, జన్మించిన తేదీ, జెండర్, క్యూ ఆర్ కోడ్, ఫొటో, 12 అంకెల ప్రత్యేక నంబరు, మార్కులు, గ్రేడు, ఉపకార వేతనం, వ్యక్తిగత, విద్యా సంబంధిత వివరాలు, క్రీడల్లో సాధించిన విజయాలు తదితరాలతో డిజిటల్ కార్డులో భద్రంగా ఉంటాయి. ఆ కార్డులో వివరాలన్నీ ఒకే చోట నమోదు చేయడంతో దీన్ని స్కాన్ చేస్తే మొత్తం వివరాలు వెంటనే తెలుసుకునే సదుపాయం కలుగుతుంది.

బ్యాంకు ఖాతా, డీజీ లాకర్‌తో అనుసంధానం..

అపార్ కార్డు విద్యార్థి బ్యాంకు ఖాతా, డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. డీజీ లాకర్ ద్వారా వివరాలు నమోదు చేస్తే విద్యార్థి పేరుతో అపార్‌కార్డు వస్తుంది. దీన్ని నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తద్వారా వివిధ విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు, ధ్రువీకరణ వంటివన్నీ సులభరీతిలో పూర్తిచేసేందుకు అవకాశం కలుగుతుంది. దీని ద్వారా ఉపకార వేతనాల మంజూరు, ఉద్యోగాల భర్తీ, వంటి సందర్భాల్లో ఈ కార్డు కీలకం కానుందని అధికారులు చెబుతున్నారు. విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి పాఠశాలలతో పాటు కళాశాలల్లోనూ ఆధార్‌కార్డులోని వివరాలను నమోదు చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ, ఇంటర్ బోర్డు నిర్వహిస్తున్న యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో ఇప్పటికే ప్రతి విద్యార్థికి పెన్ (పర్మనెంట్ ఎడ్యుకేషన్ నంబరు) ఉంది. దీని ఆధారంగానే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం, టీసీలు జారీ చేయడం వంటివి చేస్తున్నారు. ఇకపై అపార్‌తోనే అన్ని కార్యకలాపాలు నిర్వహించనున్నారు. తల్లిదండ్రుల నుంచి అనుమతి తీసుకునేందుకు ఆయా దరఖాస్తుల్లో విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులతో సంతకాలు చేయించి, యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో ఉన్న ఆధార్ నంబరు, అడ్మిషన్ నంబరు, విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు నమోదై ఉంటాయి. వాటిని సరి చూసుకుని అపార్ కార్డుకు లింక్ చేస్తారు.

విద్యార్థులకు చాలా ఉపయోగం

– ఎస్వీఎస్ గురవయ్యశెట్టి, ఆర్ఐవో, కర్నూలు

విద్యార్థులకు సంబంధించి వివరాలన్నీ ఒకే ఐడీలో నమోదవుతాయి. ప్రతి విద్యార్థి అపార్ కార్డు కోసం నమోదు చేసుకోవాలి. కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న వారికి గుర్తింపు నంబరు ఇస్తారు. ఒక్కసారి అపార్ నంబరు పొందితే అందులో అన్ని వివరాలు ఉంటాయి. ఐడీ స్కాన్ చేస్తే.. విద్యార్థి వివరాలు తెలుస్తాయి. నకిలీ సర్టిఫికెట్లకు అవకాశం ఉండదు. ప్రతి విద్యార్థికి చాలా అవసరం. మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు వివరాలు నమోదు చేయాలి.

కూటమి పాలనలో పల్లెలకు మంచి రోజులు



మాట్లాడుతున్న తిక్కారెడ్డి, పాల్గొన్న తెదేపా నేతలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పల్లె పండగను విజయవంతం చేద్దామని తెదేపా కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి పేర్కొన్నారు. తెదేపా జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణుడుతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామ సర్పంచులకు పూర్తి స్వేచ్ఛనిచ్చినందుకు గ్రామాలల్లో చేపట్టవలసిన కార్యక్రమాలను గ్రామసభలు ఆమోదించారన్నారు. వాటి అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.4,500 కోట్ల మేర నిధులు మంజూరు చేసిందని సుమారు 30 వేల పనులకు గ్రామాల్లో అభివృద్ధి పనులు మొదలయ్యాయని తెలిపారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని గత జగన్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని అన్నారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా జగన్ ప్రభుత్వం దారి మళ్లించి గ్రామాలను నిర్వీర్యం చేసిందన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ పంచాయతీలకు నిధులను సమీకరించి రూ.4,500 కోట్లు వివిధ పనుల నిమిత్తం విడుదల చేశారని, 8 రోజుల పాటు పల్లె పండగ పేరుతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిర్ణయం తీసుకుందన్నారు.

● వాల్మీకి మహర్షి జయంతిని ప్రభుత్వ పరంగా నిర్వహించేందుకు ఆదేశాలిచ్చిన సీఎం చంద్రబాబు నాయుడికి వారు కృతజ్ఞతలు తెలిపారు. నారా లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చారని, రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొని వచ్చిందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు బజారన్న, భరద్వాజశెట్టి, షేక్షావలి, ఈశ్వరయ్య, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నలుగురు వీహెచ్‌ఏల నియామకం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ సబ్ డివిజన్‌లో గొందిపర్ల-2, పంచలింగాల-2, కల్లూరు మండలం కొంగనపాడు, బస్తిపాడు రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ల (వీహెచ్‌ఏ)ను జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకుల కార్యాలయంలో సాండ్ మేనేజ్‌మెంట్ ఫెసిలిటేషన్ కాల్ సెంటర్‌కు నియమించారు. వారి స్థానంలో ఇద్దరు వీఏఏలు, ఇద్దరు ఎంపీఈవోలను రైతు సేవా కేంద్రాలకు ఇన్‌ఛార్జీలుగా నియమించారు. కర్నూలు రూరల్ మండలంలో గొందిపర్ల-1 వీఏఏ ఎన్.జగదీష్‌కు గొందిపర్ల-2 రైతు సేవా కేంద్రానికి, పంచలింగాల-1 వీఏఏ యాపలదిన్నె దేవకుమార్‌ను పంచలింగాల-2కు, కల్లూరు ఎంపీఈవో బి. రఘురాముడిని కల్లూరు మండలం కొంగనపాడుకు, కల్లూరు ఎంపీఈవో కె.అరుణను కల్లూరు మండలం బస్తిపాడు రైతు సేవా కేంద్రాలకు ఇన్‌ఛార్జీలుగా నియమిస్తూ కర్నూలు ఏడీఏ సాలురెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

పెట్రోలు పోసుకొని యువకుడి ఆత్మహత్య



గూళెప్ప (పాత చిత్రం)

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: పెద్దకడబూరు మండలం జాలవాడిలో సోమవారం ఓ యువకుడు శరీరంపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులు తెలిపారు. కంబళదిన్నెకు చెందిన ఈరన్న రెండో కుమారుడు గూళెప్ప(30) జాలవాడిలోని సచివాలయం సమీపంలో పెట్రోలు పోసుకొని నిప్పటించుకున్నారు. మంటల తాకిడిని తట్టుకోలేక కేకలు వేస్తూ రోడ్డుపై దొర్లుతుండగా గుర్తించిన స్థానికులు మంటలను అదుపు చేసేలోగా శరీరమంతా కాలిపోయింది. అతన్ని చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. గూళెప్పకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లి ఇటీవల దసరాకు గ్రామానికి వచ్చినట్లు బంధువులు పేర్కొన్నారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నిరంజన్‌రెడ్డి వివరించారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: వైద్యవిద్యలో చేరిన విద్యార్థుల సమస్యలు, ఇబ్బందులపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ.. పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ అన్నారు. వైద్యకళాశాలలోని న్యూలెక్చరర్ గ్యాలరీలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ చేరిన వైద్యవిద్యార్థులకు రెండు వారాల ఫౌండేషన్ కోర్సును సోమవారం ప్రారంభించారు. ప్రతి వైద్యవిద్యార్థి క్రమశిక్షణతో మెలగాలని, హాజరు శాతం 75శాతం ఉండాలని ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ప్రభాకరరెడ్డి మాట్లాడారు. కార్యక్రమములో వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ విజయానంద్‌బాబు, డాక్టర్ రేణుకా దేవి, ఇన్‌ఛార్జి ప్రొఫెసర్ డాక్టర్ మాధవిశ్యామల, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సోమశేఖర్, ఎంఈయూ సమన్వయకర్త డాక్టర్ సింధియా శుభప్రద, అన్ని విభాగాధిపతులు అసోసియేట్ అసిస్టెంట్‌లు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ, పాల్గొన్న వివిధ విభాగాధిపతులు

48 మంది బాధితుల ఫిర్యాదు



సమస్య వింటున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: స్థానిక కొత్తపేటలోని ఎస్పీ బంగ్లా క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వేర్వేరు ప్రాంతాల నుంచి 48 మంది వచ్చి ఎస్పీ జి.బిందుమాధవ్‌కు ఫిర్యాదు పత్రాలు అందజేశారు. విచారణ జరిపించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

■ హైదరబాద్‌కు చెందిన హరిప్రసాద్‌రెడ్డి ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2.30 లక్షలు తీసుకుని మోసగించాడని దేవనకొండ మండల బేతపల్లికి చెందిన శివశంకరరెడ్డి ఫిర్యాదు చేశారు.

■ ఆస్తి రాసివ్వాలని ఇబ్బంది పెడుతున్న కొడుకు, కోడలు నుంచి రక్షణ కల్పించాలని కర్నూలులోని పాతబస్తీకి చెందిన సరస్వతి విన్నవించుకున్నారు.

■ నకిలీ పట్టాలు అధికారులపై చర్యలు తీసుకోవాలని కర్నూలులోని వీకర్‌సెక్షన్‌కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు విన్నవించారు.

■ తనపై దాడి చేసి, ఇంట్లోకి రానివ్వకుండా ఆస్తిని ఆక్రమించుకునే యత్నం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదోనికి చెందిన సంగీత భాయి ఫిర్యాదు చేశారు.

■ ఉయ్యాలవాడకు చెంది నాగేశ్వరరెడ్డి 59 క్వింటాళ్లు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఓర్వకల్లు మండలం లొద్దిపల్లికి చెందిన మహదేవుడు ఫిర్యాదు చేశారు. తన పంటను నాశనం చేసిన నాయకల్లుకు చెందిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కల్లూరు మండలం దుపాడుకు చెందిన మహేష్ ఫిర్యాదు చేశారు.

ప్రణాళికలు రూపొందించండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర విజన్-2047కి సంబంధించిన జిల్లా ప్రణాళికలను త్వరితగతిన రూపొందించి సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. విజయవాడ సీఎస్ కార్యాలయం నుంచి గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీఎస్‌డీపీ), సెన్సిటైజేషన్ స్వర్ణాంధ్ర 2047 అంశాలపై సోమవారం సీఎస్ వీడియో సమావేశంలో సమీక్ష నిర్వహించారు. జిల్లా ప్రణాళికలను త్వరితగతిన రూపొందించి నివేదికలను సమర్పించాలని సీఎస్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, సీపీవో హిమ ప్రభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.


ఆధిపత్య పోరు.. విద్యార్థుల ఆకలి కేకలు



భోజనం పెట్టకపోవడంతో ఖాళీ పళ్లేలతో విద్యార్థులు

ఆదోని గ్రామీణ న్యూస్‌టుడే : ఆదోని నియోజకవర్గంలో కూటమి నాయకుల మధ్య సయోధ్య కుదరడం లేదు. మధ్యాహ్న భోజనం పథకం, ఉపాధి పథకం క్షేత్ర సహాయకులు, రేషన్ డీలరు తదితర పోస్టుల విషయంలో ఏకాభిప్రాయం కుదరడం లేదు. ఇది మండలంలోని అరేకల్ గ్రామంలోని జడ్పీ పాఠశాల విద్యార్థుల పాలిట శాపంగా మారింది. సోమవారం మధ్యాహ్న భోజనాన్ని వడ్డించకపోవడంతో విద్యార్థులు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాఘవేంద్ర స్వామి పొదుపు లక్ష్మి గ్రూప్‌నకు మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ అప్పగిస్తూ అధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. మీరు ఎలా చేస్తారంటూ గ్రామంలోని కొంతమంది కూటమి నాయకులు అడ్డుకున్నారు. సమస్యను పరిష్కరించడంలో విద్యాశాఖ అధికారులు విఫలం అవుతున్నారని ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు

మిరప పంట ధ్వంసం



ఆదోని మండలం పెద్దహరివాణంలో ధ్వంసం చేసిన పంట

ఆదోని గ్రామీణం న్యూస్‌టుడే : ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామంలో గాదెప్పకు చెందిన మిరప పొలాన్ని సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గాదెప్ప ఎకరా పొలంలో బ్యాడిగి మిరప ను రూ.1లక్ష పెట్టుబడి పెట్టి సాగుచేశారు. ప్రస్తుతం పంట చేతికి వస్తుండటంతో గుర్తు తెలియని వ్యక్తుల మిరప పంటను ధ్వంసం చేసినట్లు తండ్రి కుమారుడు గాదెప్ప, కృష్ణ తెలిపారు. దాదాపు రూ.60వేల దాక నష్టం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది కూడా ఇలాగే జరిగిందని పోలీసులు దృష్టి సారించి న్యాయం చేయాలని కోరారు.

లక్ష్యంపై గురి.. పతకాలతో మెరిసి

☛ పవర్ లిఫ్టింగ్‌లో మహేశ్ సత్తా



జాతీయస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మహేశ్

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: లక్ష్యం ముందు పేదరికం అడ్డురాదనుకున్నాడు. కష్టం చేస్తూనే చదువుతో పాటు పవర్‌లిఫ్టింగ్‌లో తనదైన శైలిలో రాణిస్తున్నాడు. చదువుకుంటూనే హమాలీగా పని చేస్తూ వచ్చిన డబ్బుతో కుటుంబానికి ఆసరా ఉంటూనే తనకంటూ ఓ లక్ష్యాన్ని ఏర్పరుచుకున్నాడు. రోజూ ఖాళీ సమయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు కోసం వ్యాయామశాలలో కఠోరంగా శ్రమిస్తూ కళాశాలకు వెళ్లి ఆ తర్వాత హమాలీగా పనిచేస్తూ జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తున్నారు.

నంద్యాల పట్టణం గాంధీచౌక్‌కు చెందిన యు.లక్ష్మిబాయి, యు.వెంకటేశ్వరరావుల కుమారుడు మహేశ్ డిగ్రీ తృతీయ ఏడాది చదువుతున్నారు. ఒకవైపు చదువుతూనే నంద్యాల మార్కెట్ యార్డులో హమాలీగా పని చేస్తున్నారు. చిన్న వయసులోనే బరువులు ఎత్తడం చూసిన ఓ కానిస్టేబుల్ పవర్ లిఫ్టింగ్‌లో తర్ఫీదు పొందాలని సూచించడంతో ఖాళీ సమయాల్లో శిక్షణ పొందేవారు. ఎక్కడైన పోటీలు జరిగితే మహేశ్ పోటీలే లక్ష్యంగా పాల్గొనేవారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించి నేటి యువతరానికి ఆదర్శంగా నిలిచారు. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడమే తన లక్ష్యమని ఆయన చెబుతున్నారు.

సాధించిన విజయాలు

■ 2021 ఫిబ్రవరిలో విశాఖపట్నం జిల్లా గంగవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణం సాధించారు.

■ 2022 జులైలో నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణం సాధించారు.

■ 2022 సెప్టెంబరులో జరిగిన జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో రెండు స్వర్ణాలు గెలుపొందారు.

■ 2023 జులైలో తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని రజతం దక్కించుకున్నారు.

■ 2024 సెప్టెంబరులో అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని కాంస్యాన్ని సాధించారు.

ఈ నెల 14 నుంచి 18 వరకు గోవాలో జరిగే జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకం సాధనే లక్ష్యంగా పాల్గొననున్నట్లు మహేశ్ తెలిపారు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ


పంకాలు, ఎల్‌ఈడీ దీపాలు అందచేస్తున్న దాతలు

ఆలయానికి పంకాలు అందజేత

ఆదోని పాతపట్టణం న్యూస్‌టుడే: పట్టణంలోని పేట వీరభద్రస్వామి ఆలయానికి ఆల్కూరు మఠం విజయ్‌కుమార్‌స్వామి కుటుంబీకులు సోమవారం ఐదు పంకాలు, ఎల్‌ఈడీ దీపాలను అందించారు. ఆలయ ఛైర్మన్ చంద్రశేఖరయ్యస్వామి, వార్డు కౌన్సిలరు నాగరత్నమ్మకు అందించారు. కుటుంబీకులు గిరిజావాణి విజయ్‌కుమార్, వీరప్రకాష్, సుధామణి, నీలకంఠ, లత తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అల్పపీడనం నేపథ్యంలో ఆదోని మార్కెట్ యార్డుకు పంట దిగుబడులు తీసుకొచ్చే రైతులు అప్రమత్తంగా ఉండాలని యార్డు కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు. అధిక మొత్తంలో దిగుబడులు తీసుకొచ్చి, యార్డులో ఇబ్బందులు పడొద్దని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 8008573822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: సమస్య : ఆదోని పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీలో తాగునీరు రాక ఆరు రోజులవుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- మహమ్మద్‌గౌస్ కాలనీవాసి**

సమాధానం : మోటార్లకు మరమ్మతులు చేసి నీటిని సరఫరా చేస్తాం.

- కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

హొళగుంద, న్యూస్‌టుడే :

సమస్య : స్థానిక ప్రాథమిక పాఠశాల ముందు మురుగు కాల్వలో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. **- మల్లికార్జున, వందవాగిలి**

సమాధానం : పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం.

- రంగస్వామి, పంచాయతీ కార్యదర్శి వందవాగిలి

చిప్పగిరి, న్యూస్‌టుడే : సమస్య : గుమ్మనూరులో వైఎస్ఆర్ క్లినిక్ నిర్మాణం అర్ధాంతరంగా ఆగింది. పూర్తి చేసి వైద్య సేవలు అందించాలి. **- మల్లికార్జున, గుమ్మనూరు**

సమాధానం : త్వరలో పూర్తి చేసి వైద్యం అందుబాటులోకి తెస్తాం.

- పార్వతమ్మ, మండల వైద్యాధికారి, చిప్పగిరి

బకాయిలు చెల్లించాలి

ఆదోని విద్య, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని ఎస్టీయూ ఆదోని పట్టణ అధ్యక్షుడు కె.రవి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ పైనల్ పేమెంట్స్, మెడికల్ బిల్లులు వేయడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని వాపోయారు. 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండు చేశారు. లోక్యనాయక్, నాగరాజు, వీరచంద్రయాదవ్, ప్రహ్లాద, సుధాకర్‌బాబు, ఖలీల్, జుబేర్, ప్రసాద్, విజయ్, ఉరుకుందప్ప, మారయ్య, శ్రీరాములు, నిరంజన్‌రెడ్డి, పాల్గొన్నారు.


పాల్గొన్న ఎస్టీయూ నాయకులు

కుంకనూరులో దస్తగిరయ్య స్వామి ఉరుసు

దేవనకొండ, న్యూస్‌టుడే : మండల పరిధిలోని కుంకనూరు గ్రామంలో వెలసిన దస్తగిరయ్య స్వామి ఉరుసు మంగళవారం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఉరుసుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఐరన్‌బండ బి.సెంటర్ గ్రామంలో బుధవారం దస్తగిరి స్వామి ఉరుసు పురస్కరించుకొని జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అసౌకర్యాల గృహాలు..

వసతికి ఇబ్బందులు

బీసీ ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. శిథిలావస్థకు చేరిన భవనాలకు మరమ్మతులు చేయించడంతో పాటుగా అద్దె భవనాల్లోని వసతి గృహాలకు శాశ్వత భవనాలను నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. వసతి గృహాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం అజయ్ పథకం కింద రూ.206 కోట్లతో పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపడుతోంది. దీంతో శిథిలావస్థలో ఉన్న, సౌకర్యాలు లేని వసతి గృహాల రూపురేఖలు మారనున్నాయి.

నియోజకవర్గం	మండలాలు	మొత్తం వసతి గృహాలు	విద్యార్థుల సంఖ్య	అద్దె భవనాలు	ప్రభుత్వ భవనాలు
ఆదోని	ఆదోని మండలం	10	1800	5	5
ఆలూరు	6	11	1310	3	8
పత్తికొండ	5	15	3,488	1	14



పెచ్చులూడుతున్నాయి..

ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఆదోని పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహం భవనం. ఇందులో 257 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఈ భవనంలో కొన్ని గదుల్లో పైకప్పు పెచ్చులూడి శిథిలావస్థకు చేరింది. దీంతో కొంత మంది విద్యార్థులను సమీపంలోని ప్రాథమిక పాఠశాల గదుల్లో ఉంచారు. కూటమి ప్రభుత్వంలోనైనా వసతి గృహానికి మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఆదోని విద్య**

వర్షపు నీరు చేరుతోంది



ఆలూరులోని బాలికల వసతి గృహానికి సొంత భవనం ఉన్నా సమస్యలు వేధిస్తున్నాయి. విద్యార్థులకు సరిపడినన్ని గదులు లేకపోవడంతో చాలా అవస్థలు పడుతున్నారు. వంట గది పైన పెచ్చులూడి పోతుండటంతో పాటు మురుగునీటి సమస్య వేధిస్తోంది. వర్షాలు వచ్చినప్పుడు వసతి గృహంలోకి వర్షపు నీరు వచ్చి చేరుతుంది. దీంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రహరీ గోడను సైతం ఎత్తు పెంచాలని విద్యార్థులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, ఆలూరు గ్రామీణ**

ప్రతిపాదనలు తయారు చేసి పంపించాం

- రాజాకుళ్లాయప్ప యాదవ్, బీసీ సంక్షేమ శాఖ డివిజన్ అధికారి, ఆదోని

ఆదోని పరిధిలో శిథిలావస్థకు చేరిన వసతి గృహాల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. డివిజన్ పరిధిలోని 7 వసతి గృహాల్లో మరుగుదొడ్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయి. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

పైకప్పు కూలిపోయింది

పత్తికొండలోని బీసీ బాలికల వసతి గృహం, కృష్ణగిరి మండలం కంబాలపాడు ఎస్సీ వసతి గృహం మద్దికెర బీసీ వసతి గృహం వరండా పైకప్పు కులిపోయి శిథిలావస్థకు చేరింది.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది పత్తికొండలోని బీసీ బాలికల వసతి గృహ భవనం. ఇక్కడ బాలికలు ఉండేందుకు రక్షణ లేదనే కారణంతో అధికారులు ఎలాంటి సౌకర్యాలు లేని ఓ ప్రైవేటు భవనంలో కొనసాగిస్తున్నారు. ఇక్కడ 230 మంది విద్యార్థులు ఉండగా వారికి ఎలాంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. గదులు లేక హాలులోనే సర్దుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. **- న్యూస్‌టుడే, పత్తికొండ**

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

హొళగుంద, న్యూస్‌టుడే : మండల తహసీల్దార్‌గా కె.సతీష్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రసాదరాజు పత్తికొండ ఆర్డీవో కార్యాలయం పరిపాలనాధికారిగా బదిలీ అయ్యారు.

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే : ఆదోని పురపాలక సంఘం రెవెన్యూ అధికారిగా నాసీర్ హుస్సేన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు.

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే : ఆదోని పురపాలక సంఘం పట్టణ ప్రణాళిక విభాగంలో ఏసీపీ (సహాయ సిటి ప్లానర్)గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణసింగ్‌ను సోమవారం పట్టణ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ సంఘం నాయకులు సన్మానించారు.

అభివృద్ధి పథంలో నడిపిస్తాం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వంలో అన్ని స్థాయిలలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటు పడిందని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం ఆదోని మండలం బైచిగేరి గ్రామంలో పల్లెపండుగలో భాగంగా సిమెంటు రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే, అధికారులు, కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. వైకాపా ప్రభుత్వంలో కూటమి నాయకులు అణిచివేతకు గురయ్యారని, అలాంటి వారిని గుండెల్లో పెట్టుకుంటామన్నారు. వైకాపా కార్యకర్తలు, నాయకులపై ఎలాంటి కక్ష్య సాధింపు చర్యలు చేపట్టబోమన్నారు. అనంతరం గ్రామంలో ప్రజల కోసం మీ పార్థసారథి అనే కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగు కాల్వలు, రహదారులు, తాగునీరు, తదితర సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మహదేవ, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ, భాజపా రాష్ట్ర నాయకులు విట్టారమేష్, జనసేన బాధ్యుడు మల్లప్ప, భాజపా జిల్లా అధ్యక్షుడు నీలకంఠ, పంచాయతీరాజ్ డీఈ రాణి, డ్వామా ఏపీడీ లోకేష్, మాజీ ఎంపీపీ పంపాపతి, తదితరులు పాల్గొన్నారు.


ఆదోని మండలం బైచిగేరి గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

కూటమి పాలనను ప్రజల్లోకి తీసుకెళ్దాం

ఆదోని పాతపట్టణం న్యూస్‌టుడే : ఆదోని పట్టణంలోని ఆర్.ఆర్.లేబర్ కాలనీలో 35వ వార్డు కౌన్సిలరు లలితమ్మ ఆధ్వర్యంలో వైకాపాకు చెందిన వంద కుటుంబాలు ఎమ్మెల్యే డా.పార్థసారథి సమక్షంలో సోమవారం రాత్రి భాజపాలో చేరారు. చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్రకుమార్, నాగరాజుగౌడ్, వెల్లాల మధుసూదన్‌శర్మ తదితరులున్నారు.

పల్లె ప్రగతే ప్రభుత్వ ధ్యేయం

పత్తికొండ గ్రామీణం న్యూస్‌టుడే : ప్రతి పల్లెలో ప్రజలకు సదుపాయాలు కల్పించి ప్రగతి పథంలో ముందుకు తీసుకుపోవటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని చక్కరాళ్ల, దూదేకొండ, పత్తికొండ ముస్లిం వీధిలో సీసీ రహదారుల ఏర్పాటుకు సోమవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో గ్రామాలను వైకాపా ప్రభుత్వం పట్టించుకోనందువల్లనే ఎక్కడ చూసినా మురుగు తాండవిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో రాబోయే రోజుల్లో పల్లెల రూపురేఖలు పూర్తిగా మారనున్నాయన్నారు. తెదేపా సీనియర్ నాయకులు సాంబశివారెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్, పంచాయతీరాజ్ డీఈ శేషయ్య, ఏఈ వెంకటేశ్వర్లు, ఈవోఆర్డీ నరసింహులు, గ్రామ ఎంపీటీసీ సభ్యుడు పత్తికొండ రాజు, పత్తికొండ గ్రామ సర్పంచి కొమ్ము దీపిక, నాయకులు అధికారులు పాల్గొన్నారు.


సీసీ రహదారులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధి పనులకు శ్రీకారం

దేవనకొండ, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'పల్లె పండగ వారోత్సవాలలో భాగంగా దేవనకొండ మండల కేంద్రంలో పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, తెదేపా ఆలూరు ఇన్‌ఛార్జి వీరభద్రగౌడు, జనసేన ఇన్‌ఛార్జి తెర్నేకల్ వెంకప్ప పలు అభివృద్ధి పనులకు భూమి పూజలు చేశారు. సీసీ రహదారులు, మినీ గోకులాలు తదితర పనులకు శ్రీకారం చుట్టారు. దేవనకొండతో పాటు కుంకనూరు, పొట్లపాడు, వెలమకూరు గ్రామాల్లో వివిధ పనులకు భూమి పూజలు చేశారు. ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, పీఆర్ డీఈఈ మనోహర్, తహసీల్దార్ లోకేశ్వరరావు, ఏపీడీ ఫక్కీరప్ప, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న కూటమి నాయకులు


సబ్ కలెక్టర్ భరద్వాజ్‌కు వినతి పత్రం అందిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

అన్ని కార్యాలయాల్లో వాల్మీకి జయంతిని నిర్వహించాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వాల్మీకి జయంతిని నిర్వహించాలని వాల్మీకి బోయ సంఘం జిల్లా కార్యదర్శి పరమేష్, నాయకులు రాజు, ఈరన్న, వీరాంజనేయులు, వీరారెడ్డి, నాగరాజు హనుమంతరెడ్డి కోరారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ భరద్వాజన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవాలని ఆదేశాలు జారీ చేయడం సంతోషకరమన్నారు.

ఆలయ భూములు రక్షించాలని ధర్నా

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే : ఆదోని నియోజకవర్గంలో ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కబ్జాదారుల చెర నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ భాజపా నాయకులు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కో-కన్వీనర్ నాగరాజుగౌడ్ మాట్లాడుతూ వెంగళాపురం గ్రామ పరిధిలో సర్వే సంఖ్య 24, 25 చౌకిమఠం, బైరాగి మఠం భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. తక్షణం విచారణ చేపట్టి, నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. నాయకులు లోకేష్‌కుమార్, నాగార్జున, మహాదేవ్, మహేష్‌నాయక్, మాబాషా, ఉరుకుందుగౌడ్, శ్రీకాంత్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న భాజపా నాయకులు

వైద్య కళాశాల పనులు పునఃప్రారంభించాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదోనిలో నిలిచిపోయిన వైద్య కళాశాల పనులను తక్షణమే పునఃప్రారంభించాలని విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకులు సోమవారం సాయంత్రం పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబును కలసి వినతి పత్రం అందజేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ వైద్య కళాశాల పనులు అర్ధాంతరంగా ఆగిపోవటంతో ఈ ఏడు ప్రారంభం కావాల్సిన వైద్య విద్యార్థుల ప్రవేశాలు నిలిచిపోయాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పనులు చేపట్టేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. శ్రీనివాసులు, వీరేశ్, సోమశేఖర్, ఉదయ్, తిరుమలేశ్, వినోద్ తదితరులు ఉన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వినతి

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే : మంత్రాలయం మండలం మాధవరం రాంపురం గ్రామానికి చెందిన సులేమాన్ షేక్‌సుకుమార్, షేక్ రజాక్‌కు సంబంధించి వారసత్వంగా వచ్చిన 18.20 ఎకరాల సాగు భూమిని కొందరు ఆక్రమించారని వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ భరద్వాజను కలిసి వినతి పత్రం అందించారు. సమగ్రంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా నాయకులు భాస్కర్‌యాదవ్, లక్ష్మన్‌నాయక్, బసాపురం గోపాల్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతం కాకుండా చూడాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ, ఇనాం భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ అన్నారు. సోమవారం సాయంత్రం పత్తికొండ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి తహసీల్దార్లు, ఉప తహసీల్దార్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా మండలాల్లోని ప్రభుత్వ, ఇతర రెవెన్యూ భూములు సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. గతంలో ఎక్కడైన భూములు అన్యాక్రాంతమయ్యాయా అనే వివరాలను తెలుసుకోవాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలన్నారు. గతంలో నిర్వహించిన భూసర్వేలో తలెత్తిన వివాదాల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో భరత్ నాయక్

పల్లె పండగలో ఆధిపత్య పోరు

మద్దికెర న్యూస్‌టుడే : పల్లె పండగ రోజే అధికార పార్టీలో విబేదాలు భగ్గుమన్నాయి. మండలంలోని మదనంతపురం గ్రామంలో తెదేపా నాయకులు శ్రీనివాసులు, సంజప్పపై మరో వర్గానికి చెందిన ప్రసాద్, హనుమంతు తదితరులు గ్రామానికి మంజూరైన సిమెంటు రోడ్డు పనులను మీరు మాత్రమే ఎలా చేస్తారని, మేము కూడా పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడ్డామంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకొనేందుకు యత్నించడంతో స్థానికులు సర్ది చెప్పి అక్కడి నుంచి పంపించివేశారు.

జయంత్యుత్సవాలకు తరలి రండి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే : పత్తికొండలో ఈ నెల 17న నిర్వహించనున్న వాల్మీకి జయంతి వేడుకలకు వాల్మీకి సోదరులు అధిక సంఖ్యలో తరలి రావాలని జయంతి వేడుకల బాధ్యులు రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పత్తికొండ పట్టణంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు.

పడిపోయిన టమాటా ధర

పత్తికొండ గ్రామీణం న్యూస్‌టుడే : పత్తికొండ మార్కెట్‌లో టమాటాలను దసరా పండుగ అనంతరం సోమవారం ఒక్కరోజే 800 క్వింటాళ్లకు పైగా సరకును రైతులు మార్కెట్‌కు తరలించారు. దసరాకు ముందు క్వింటా గరిష్ఠ ధర రూ. 5వేలకు పైగా పలకగా సోమవారం క్వింటా గరిష్ఠ ధర రూ. 3వేలకు లోపే ఉందని రైతులు వాపోయారు.

మరింత తగ్గిన పత్తి..

ఆదోని మార్కెట్ న్యూస్‌టుడే : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధర సోమవారం మరింత తగ్గుముఖం పట్టింది. నాలుగు రోజుల దసరా సెలవుల అనంతరం మార్కెట్ యార్డులో వ్యాపారాలు ఆరంభమయ్యాయి. క్వింటాలు కనిష్ఠంగా రూ. 4211, గరిష్ఠంగా రూ. 7519, మధ్య ధర రూ. 7379లు పలికాయి.

నేడు ఎమ్మెల్యే రాక

కృష్ణగిరి, న్యూస్‌టుడే: కృష్ణగిరి మండలానికి మంగళవారం పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు రానున్నట్లు ఎంపీడీవో మోహన్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన కృష్ణగిరి మండలం టి.గోకులపాడు, తొగర్చేడు, రామకృష్ణాపురం గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ దారులకు భూమి పూజ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సారూ.. రహదారి బాగు చేయరూ



ఆస్పరి మండలంలోని డీ కోటకొండ నుంచి కారుమంచి వరకు 3 కిలోమీటర్ల రహదారి అధ్వానంగా ఉంది. అడుగడుగునా గుంతలుపడి ఉండటంతో ఈ దారిలో రాకపోకలు సాగించాలంటేనే విద్యార్థులు, మహిళలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి రోడ్డును బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే ఆస్పరి**

మాట నిలబెట్టుకున్న లోకేశ్

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్ర మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో వాల్మీకులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని రాష్ట్ర వాల్మీకి సాధికారిక సభ్యులు రామకృష్ణ అన్నారు. ఆదోనిలో ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పర్యటించారు. వాల్మీకుల జయంతిని పండగ దినంగా ప్రకటించాలని విన్నవించామని, ఇచ్చిన మాట ప్రకారం ఈ నెల 17వ తేదీన వాల్మీకి జయంతిని అధికారంగా నిర్వహించడానికి ప్రభుత్వం ప్రకటన చేయడం సంతోషకరమన్నారు.

ఈ ఏడాది ఆదాయ లక్ష్యాలను అధిగమిస్తాం

ముఖాముఖి



ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 2024-25 ఏడాదికి సంబంధించిన సీజన్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాము. ఈ ఏడాది ఆదాయ లక్ష్యాలను అధిగమిస్తాం. యార్డులో పారదర్శకంగా వ్యాపారాలు నిర్వహించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. తూకాల్లో కోతలు లేకుండా, అదనపు నగదు కత్తిరింపులు లేకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాము. ఎవరైనా రైతులను ఇబ్బందులకు గురిచేసినట్లయితే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆదోని వ్యవసాయం మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి న్యూస్‌టుడేతో తెలిపారు.

రామ్మోహన్‌రెడ్డి, కార్యదర్శి, ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు

బకాయిలపై దృష్టి సారింపు

2024-25 ఏడాదికి సంబంధించి రూ. 17 కోట్లు ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే రూ. 6.50 కోట్లు ఆదాయాన్ని ఆర్జించాం. గతేడాది 4.50 లక్షల క్వింటాళ్ల పత్తి రాగా, ఈ సారి 5-6 లక్షలు క్వింటాళ్ల దాకా పత్తి వస్తుందని అంచనా వేస్తున్నాం. ఇక బకాయిలపై దృష్టి సారించి వంద శాతం వసూళ్లు సాధిస్తాం.

అంతర్జాల బ్లూటూత్ విధానం అమలు

ఆదోని మార్కెట్లో తూకాల్లో పారదర్శకత కోసం అంతర్జాల బ్లూ టూత్ విధానం అమల్లో ఉంది. ఇక పత్తి దిగుబడులు బోరాల్లో కాకుండా లూజుగా వాహనాల్లో తీసుకువస్తే రైతులకు బోరాల ఖర్చు, రవాణ, కూలీ ఖర్చులు తగ్గుతాయి. నేరుగా వాహనం తూకం వేసేందుకు యార్డు లోనే వే బ్రిడ్జిను అందుబాటులోకి తీసుకువస్తున్నాం. దీని వల్ల తూకాలు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంది.

వేరుశనగ వ్యాపారాలకు అవకాశం

ఆదోని యార్డులో పాత ఫ్లాట్‌ఫారాల ప్రాంతంలో ముంపు నివారణ చర్యల కోసం రూ. 3 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాం. పరిపాలన, ఆర్థికపరమైన అనుమతులు రాగానే పనులను పూర్తి చేస్తాం. వర్షం కష్టాలు లేకుండా కొత్త పత్తి యార్డులో వేరుశనగ వ్యాపారాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశాం.

రూ.5 కోట్లతో ప్రతిపాదనలు

విశ్రాంత భవనం శిథిలావస్థకు చేరుకుంది. గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపినా టెండర్ దశలోనే ఆగిపోయింది. ప్రస్తుతం విశ్రాంత భవనంతో పాటు కార్యాలయ, పరిపాలన భవనాల మరమ్మతుల నిర్మాణం కోసం రూ. 5 కోట్లతో మార్కెటింగ్ శాఖకు ప్రతిపాదనలు పంపించాము.

ప్లాస్టిక్ సంచుల్లో పత్తి తీసుకురావద్దు

ఆదోని యార్డులో పంట దిగుబడుల అమ్మకాల అనంతరం కేవలం కమీషన్ మాత్రమే పట్టుకోవాలి. అలా కాకుండా అదనపు నగదు కత్తిరింపులు చేసేందుకు మార్కెటింగ్ శాఖ చట్టాలు ఒప్పుకోవు. వీటిపై ప్రచారం కోసం గోడ పత్రికలు ముద్రించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాము. ఇక ప్లాస్టిక్ సంచుల్లో పత్తి తీసుకురావడంతో పత్తి నాణ్యత దెబ్బతిని ధరలపై ప్రభావం పడుతుంది. రైతులు గమనించాలి.

రైతులకు రాయితీ భోజనం

పంట దిగుబడులు అమ్మకానికి వచ్చే రైతుల కోసం శుద్ధి చేసిన నీటిని అందిస్తున్నాం. ఉచిత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. సీజన్ సమయంలో రోజుకు కనిష్ఠంగా 700, గరిష్ఠంగా 1400ల మంది రైతులకు రాయితీ భోజనాన్ని అందిస్తున్నాము.

అవీ.. ఇవీ.. అన్నీ..

ఆదోని వైద్యం, న్యూస్‌టుడే : ఆదోని పట్టణంలోని హవన్నపేటలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం క్షయ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారులు షేహానాజ్ బేగం, ఎమ్పీహెచ్ఎస్ బాబురాజు, జ్ఞానేశ్వరిదేవి, శశికళ, రేఖ, పాల్గొన్నారు.

తుగ్గలి, న్యూస్‌టుడే : ఎద్దులదొడ్డి మాజీ సర్పంచి వైపీ భాస్కర్‌రెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల గ్రామానికి చేరుకొని మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి సంతాపం తెలిపారు.

హాలహర్వి న్యూస్‌టుడే : గ్రామాభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎంపీడీవో వరలక్ష్మీ పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని బిలేహల్, విరుపాపురం గ్రామాల్లో నిర్వహించారు.

చిప్పగిరి, న్యూస్‌టుడే : మండలంలోని నగరడోణ, దేగులహాలు గ్రామాల్లో రూ. 20 లక్షలతో సీసీ రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీడీవో అల్లాబకాష్, తహసీల్దారు ఇజాజ్ అహమ్మద్ తెలిపారు.

ఆస్పరి, న్యూస్‌టుడే : మండలంలోని ములుగుందం, డీకోటకొండ, బనవనూరు గ్రామాల్లో పల్లె పండుగను సోమవారం నిర్వహించారు.

వెల్దుర్తి న్యూస్‌టుడే : పల్లె పండుగతో గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో సుహాసినమ్మ అన్నారు. అల్లుగుండు గ్రామంలో పల్లెపండుగ వారోత్సవాలు సోమవారం నిర్వహించారు.

కృష్ణగిరి న్యూస్‌టుడే : ప్రభుత్వం చేపడుతున్న పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాల అభివృద్ధి వేగంగా జరుగుతుందని ఎంపీడీవో మోహన్‌కుమార్, పీఆర్ ఏఈ జాకీర్ హుస్సేన్ అన్నారు. సోమవారం అమకతాడు గ్రామ పంచాయతీ పరిధిలోని కర్లకుంట, పుట్లూరు గ్రామాల్లో సీసీ దారులను పనులు ప్రారంభించారు.

మద్దికెర న్యూస్‌టుడే : మండలంలోని మదనంతపురం గ్రామంలో పల్లె పండగ కార్యక్రమాన్ని ఎంపీడీవో కొండయ్య ఏపీవో నర్సిరెడ్డి నిర్వహించారు.

ఆదోని పురపాలకం న్యూస్‌టుడే : ఆదోని పట్టణ శివారులోని టిడ్కో గృహాల్లోని ఏర్పాట్లను పురపాలక కమిషనర్ కృష్ణ, ఎం.ఈ ఇంతియాజ్ అహ్మద్ సోమవారం పరిశీలించారు. 30 మంది లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేశారని అధికారులు తెలిపారు.

ఆదోని గ్రామీణం : పెద్దహరివాణం సమీపంలో సోమవారం ఆదోని పట్టణానికి చెందిన శ్రీనివాసులు, గిడ్డయ్యను అరెస్టు చేసి, వారి నుంచి 144 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇస్వీ ఎస్సై నాగేంద్ర తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఆదోని నేరవార్తలు : ఆదోని పట్టణ శివారు శిరుగుప్ప చెక్‌పోస్టు సమీపంలో కర్ణాటక మద్యం తరలిస్తున్న మట్కార్‌గేరికి చెందిన బండె ఆలీ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సోమవారం ఒకటో పట్టణ సీఐ శ్రీరామ్ తెలిపారు.

గుండె పోటుతో అన్నదాత మృతి

ఆస్పరి, న్యూస్‌టుడే : మండలంలోని కైరుప్పల గ్రామానికి చెందిన రైతు భీమన్న(43) సోమవారం గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు స్థానిక ప్రజలు తెలిపారు. అప్పుల బాధతో భీమన్న నిత్యం బాధపడుతుండేవారని భార్య అంజనమ్మ, ఇద్దరు కూతుళ్లు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

శ్రీమఠంలో నిత్య పూజలకు విరామం



రాఘవేంద్రస్వామి నిజ బృందావన రూపం

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీమఠంలో నిత్య పూజలకు విరామమిచ్చారు. సోమవారం నిజ బృందావన రూపంలో భక్తులకు రాఘవేంద్రస్వామి దర్శనం ఇచ్చారు. నిర్మాల్యం చేసి కాషాయ వస్త్రాలు, తులసీ మాలతో బృందావనాన్ని అలంకరించి హారతి ఇచ్చారు. నిత్య పూజలైన పంచామృతాభిషేకం, ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు రథోత్సవాలు, అన్నదానాలు, పరిమళ ప్రసాదాలు వితరణ నిర్వహించలేదు. మంగళవారం ద్వాదశి నుంచి యథావిధిగా నిత్య పూజలు నిర్వహిస్తారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భక్తులకు ఊంజల మంటపంలో తప్తముద్రాధారణ చేసి ఆశీర్వదించారు.

కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయం తహసీల్దారు కార్యాలయంలో తుపాన్ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు రవి పేర్కొన్నారు. నాలుగు రోజుల వరకు తుపాన్ ప్రభావం ఉండటంతో మంత్రాలయం తహసీల్దారు కార్యాలయంలో ఈనెల 13 నుంచి 16 వరకు ఏర్పాటు చేసినట్లు ఆయన సోమవారం తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794
కోడుమూరు : 80085 73776

మంత్రాలయం, న్యూస్‌టుడే: **సమస్య:** గ్రామంలో సీసీ రహదారులు గుంతలు పడి అధ్వానంగా ఉన్నాయి. కాలువలు కూడా లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్లపైకి వచ్చి దుర్వాసన వెదజల్లుతోంది. –లక్ష్మయ్య, మాలపల్లి

సమాధానం: గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 15 లక్షల నిధులు మంజూరయ్యాయి. గ్రామంలో మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. –శోభారాణి, ఎంపీడీవో మంత్రాలయం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: **సమస్య:** నౌలేకల్‌లో చాలా రోజుల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. దీంతో కాల్వలు నిండి అపరిశుభ్రతతో దుర్వాసన వెదజల్లుతోంది. రాత్రి పూట దోమల బెడద ఎక్కువైంది. –గ్రామస్థులు, నౌలేకల్

సమాధానం: గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను పంచాయతీ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. పంచాయతీలో నిధులను అనుసరించి పారిశుద్ధ్య నిర్మూలన చర్యలు చేపడతాం. –జయరాముడు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, పెద్దకడబూరు

వాల్మీకి జయంతిని పండగలా జరుపుకోవాలి

మంత్రాలయం, న్యూస్‌టుడే: వాల్మీకి జయంతిని అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని వాల్మీకి నాయకులు కోరారు. సోమవారం మంత్రాలయం ఎమ్మార్సీ భవనంలో ఎంఈవో రాఘన్న, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శోభారాణి, తహసీల్దారు కార్యాలయంలో డీటీ గురురాజారావులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 17న వాల్మీకి జయంతిని జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పండగలా జరుపుకోవాలని, వాల్మీకి గురించి విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా వాల్మీకి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని కోరారు. నాయకులు నరసింహులు, గోపాల్, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవో-2 రాఘన్నకు వినతిపత్రం అందిస్తున్న వాల్మీకి నాయకులు

గూడూరు, న్యూస్‌టుడే: వాల్మీకి జయంతిని ఈ నెల 17న అధికారికంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించాలని ఎన్డీఏ ప్రభుత్వం నిర్ణయించడం పట్ల భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. గూడూరులోని భాజపా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కన్నేసి.. కబ్జా చేసి

◆ ప్రజలకు తప్పని ఇబ్బందులు
◆ ఫిర్యాదులు చేసినా పట్టించుకోని పరిస్థితి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: మురుగు కాల్వలు, ఖాళీ స్థలాలు కనిపిస్తే కొందరు రాత్రికి రాత్రే బంకులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బందిగా ఉందని పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టణ ప్రణాళిక, పురపాలక శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడైనా సరే ప్రజలకు ఇబ్బందులు కలిగించే స్థలాలను కబ్జాలకు పాల్పడితే సహించేది లేదని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నా.. అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఎమ్మెల్యే బీవీ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కాల్వల పొడవునా వేసిన బంకులు

★ ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ పక్క ఒక్క దుకాణం కూడా ఉండేది కాదు. గతంలో వైకాపా నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి కళాశాలపై బంకులను ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటిని తొలగించాలని గతంలో కౌన్సిల్‌లో వాదనలు దిగిన వైకాపా నేతలు వెనుక ఉండి ఆక్రమణలు పాల్పడుతున్నారు.

డీపీ 79 కాలువ పొడవునా వైకాపా నేతలు బంకులు వేయించి కాల్వలను మూసివేయించారు. దీనిపై పలుమార్లు కలెక్టర్, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా వాటిని తొలగించలేదు.

★ ఇండోర్ స్టేడియం ఆవరణలో ఆరు బంకులను వైకాపాకు చెందిన వ్యక్తులు ఆక్రమణం వేయించారు. స్టేడియం లోపల వెళ్లేందుకు క్రీడాకారులు ప్రజలకు ఇబ్బందులు పడుతున్నా కనీసం స్పందన లేదు. వీటిని తొలగించాలని గతంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వైకాపా నేతల అనుచరులతో వాటిని అలాగే కొనసాగిస్తున్నారు.

★ మున్సిపాలిటీ ప్రహరీకి వైకాపాకు చెందిన అనుచరుడు టెంకాయల వ్యాపారం చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని పలుమార్లు ఫిర్యాదులు చేసిన స్పందన లేదు. అధికారులు స్పందించి వ్యాపారులకు వేరే చోట స్థలాలను కేటాయించాలి.



ప్రభుత్వ జూనియర్ కళాశాల బయట ఉన్న బళ్లు

★ పురపాలక సంఘం కార్యాలయంలో పక్కన మాచాని సోమప్ప ఇంగ్లీషు మీడియం పాఠశాల, జూనియర్ కళాశాల, ఉర్దూ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ఐదువేల మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల గోడకు అనుకొని ఆరు బంకులను ఏర్పాటు చేశారు. వీటిని తొలగించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాల సిబ్బంది ఫిర్యాదు చేశారు. విద్యార్థులు వెళ్లే సమయంలో కొందరు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పాఠశాల సిబ్బంది పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

★ సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన రెండు డబ్బాలను కొత్తగా ఏర్పాటు చేశారు. వీటిని తొలగించాలని పురపాలక కమిషనర్ గంగిరెడ్డికి కళాశాల బృందం రామకృష్ణ తదితరులు ఫిర్యాదు చేశారు. కళాశాల పక్కనే హోటల్స్, ఇతర బంకులు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.

★ వాల్మీకి విగ్రహం ఎదుట మున్సిపల్ దుకాణం ముందు భాగంలో గుర్తు తెలియన వ్యక్తి బంకు ఏర్పాటు చేశారు. వీటిని తొలగించాలని మున్సిపల్ దుకాణంలో అద్దెకుంటున్న యజమాని కమిషనర్‌కు విన్నవించారు.

చర్యలు తీసుకుంటాం
–గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు

ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ ప్రభుత్వ స్థలాల్లో అనుమతి లేకుండా డబ్బాలు వేస్తే చర్యలు తీసుకుంటాం. వాటిని తొలగించేందుకు సిబ్బందికి ఆదేశించాం.

ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

సి.బెళగల్, న్యూసుటుడే: వాతావరణ సూచన మేరకు ఈ నెల 16 వరకు తుపాను ఉన్నట్లు ఏవో మల్లేషు కుమారు తెలిపారు. రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో మల్లేష్ కుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం పంట కోతకు సిద్ధంగా ఉన్న కొర్ర, సజ్జ, వేరుశనగ, ఉల్లి, పత్తి తదితర పంటలను కోత వాయిదా వేసుకోవాలని సూచించారు. పంట కోత అయిన ఉల్లి, వేరుశనగ టార్పలీన్ కప్పి జాగ్రత్త ఉండాలన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాశ్ సూచించారు. ఈ నెల 16 వరకు వర్ష సూచన ఉందన్నారు. పంట కోతలు పూర్తి చేసుకున్నవారు దిగుబడులను సురక్షిత ప్రదేశంలో ఉంచుకోవాలన్నారు. శనగ పంట వేయాలనుకునే వారు వర్షాలు తగ్గిన తరువాత విత్తు వేయాలని సూచించారు.

ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో గర్భిణులకు ఆపరేషన్ల పేరుతో దోపిడీ చేస్తున్నారని ఏపీ మహిళా సంఘ నాయకురాలు వాణిమ్మ ఆరోపించారు. సోమవారం తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లో మహిళలకు సాధారణ కాన్పుల కాకుండా సిజరిన్ పేరుతో దోపిడీ చేస్తున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తే జరిమానా

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఎమ్మిగనూరులో వ్యాపారులు నిర్వహిస్తున్న విక్రయాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్లలో కూరగాయాలు, ఇతర పదార్థాలను నిల్వ ఉంచరాదన్నారు. వీటి వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని సూచించారు. ప్లాస్టిక్ విక్రయాలు చేస్తున్న వ్యాపారులపై



ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న పురపాలక కమిషనర్, అధికారులు

రూ. 10 వేలు జరిమానా విధించారు. డీఈ నీరజా, ఏఈ శరత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని అల్వాల గ్రామంలో గుండెపోటుతో మరణించిన ప్రైవేటు ట్యూషన్ మాస్టర్ కుమ్మరి బడేసాహెబ్ కుటుంబానికి అండగా ఉంటామని గ్రామంలో విద్యా బోధన చేసిన పూర్వ విద్యా



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ర్థులు పేర్కొన్నారు. సోమవారం గ్రామంలో నివాసం ఉన్న మాస్టరు కుటుంబ సభ్యులకు సర్పంచి బాషా ఆధ్వర్యంలో రూ.లక్ష నగదును అందజేశారు. శ్రీనివాసులు, ఖాసీంవలి, ప్రతాప్, ఎస్పీ బాషా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

సూగూరు (మంత్రాలయం), న్యూస్‌టుడే: బొమ్మలపై డబ్బులు వేస్తే రెట్టింపు ఇస్తానన్నందుకు వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేశ్ నాయక్ తెలిపారు. సూగూరులో అట్ట ముక్కపై బొమ్మలు ఉన్న చిత్రంతో పేక ముక్కలతో ఆడితే అంతకు రెట్టింపు డబ్బులు ఇస్తానని ప్రజలను మోసం చేస్తున్న ప్రేమదాసును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూ.680 నగదు, 80 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పరమేశ్ నాయక్ తెలిపారు.

డెంగీ అనుమానిత కేసు నమోదు



కైరవాడిలో శుభ్రం చేయిస్తున్న వైద్య సిబ్బంది

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని కైరవాడి గ్రామంలోని బీసీ కాలనీలో ఎనిమిదేళ్ల బాలుడికి డెంగీ లక్షణాలు ఉన్నట్లు జిల్లా వైద్యాధికారుల నుంచి సమాచారం అందినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో పర్యటించి అనుమానిత కేసు ఇంటి పరిసరాలతో పాటు కాలనీలో మురుగు నీటి నిల్వ ప్రాంతాలను పంచాయతీ, వైద్య సిబ్బంది పరిశీలించారు. దోమల ఉద్ధృతి తగ్గించేందుకు రసాయనిక ద్రావణాలను పంచాయతీ సిబ్బందితో పిచికారి చేయించారు. హెల్త్ సూపర్‌వైజర్లు హనుమంతు, పరమేశ్, సుధాకర్, విజయభారతి ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సాంకేతిక రంగంలో రాణిస్తే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీరన్న పేర్కొన్నారు. బీటెక్, ఎంబీఏ చివరి సంవత్సరం చదువుతున్న 16 మంది విద్యార్థులు బిజినెస్ డెవలప్మెంట్ అసోసియేట్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్యార్థులంతా సాంకేతికతో నైపుణ్యత పెంపొందించుకోవాలని సూచించారు. కంపెనీలకు ఎంపికైన అభ్యర్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మెలకువలు సాధించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ సుధాకర్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వివిధ కంపెనీలకు ఎంపికైన విద్యార్థులలో ప్రిన్సిపల్, అధ్యాపక బృందం

గ్రామాభివృద్ధికి కృషి

నందవరం, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమంతో.. ప్రతి గ్రామంలో అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నందవరం మండల పరిధిలోని హాలహర్వి, జగ్గాపురం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్కటి అమలు చేస్తామన్నారు. దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ పథకం ప్రారంభిస్తామన్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో పుల్లయ్య, ఆయా శాఖ అధికారులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధికి పల్లె పండగ కార్యక్రమం ఎంతో తోడ్పడుతుందని మంత్రాలయం నియోజకవర్గ నాయకుడు రాఘవేంద్రరెడ్డి, కౌతాళం మండల తెదేపా అధ్యక్షుడు ఉలిగయ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కౌతాళం, పొదలకుంట, కాత్రికి గ్రామాల్లో సీసీ రహదారి నిర్మాణానికి భూమిపూజ చేశారు. తెదేపా రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి అడివప్పగౌడు, చౌదరి బసవ, గిరి, జనసేన రామాంజనేయులు, పొదలకుంట సర్పంచి రంగస్వామి, అమరేష్, ఉసేని, కాత్రికి చంద్రయ్య, శివమూర్తి, కౌతాళం ఎస్సై రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



పొదలకుంటలో సీసీ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న తెదేపా నాయకులు

పల్లె ప్రజల కష్టాలు దూరం

కె.నాగలాపురం (గూడూరు), న్యూస్‌టుడే:



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో, సర్పంచి, తెదేపా నాయకులు

వైకాపా పాలకులు పల్లెలను పట్టించుకోకపోవడంతో కనీస సౌకర్యాలు కరవైయ్యాయని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లెల ప్రగతికి పెద్దపీట వేసిందని సర్పంచి నయోమి పేర్కొన్నారు. మండల పరిధిలోని కె.నాగలాపురంలో సోమవారం పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీసీ రోడ్డు, మినీ గోకులం షెడ్డు నిర్మాణానికి భూమి పూజలు చేశారు. ఎంపీడీవో శివ నాగప్రసాద్, వార్డు సభ్యులు, తెదేపా నాయకులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అంతర్గత రోడ్లకు మహర్దశ



కంబళదిన్నెలో సీసీ రహదారికి భూమి పూజ చేస్తున్న రమాకాంతరెడ్డి

పెద్దకడబూరుల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పల్లె పండగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని గుంతలు పడిన అంతర్గత రహదారులన్నీ సీసీ రహదారులుగా మారుతున్నాయని తెదేపా రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి పేర్కొన్నారు. మండంలోని జాలవాడి, కంబళదిన్నె గ్రామాల్లో సోమావారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అంతర్గత రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో జయరాముడు, తహసీల్దారు శ్రీనాథ్, పీఆర్ ఏఈ ఖాదర్‌బాషా, తెదేపా నాయకులు ఏసోబు, బాషా, నాగేంద్ర, తాయన్న పాల్గొన్నారు.

కంపుకొడుతోంది.. శుభ్రం చేయండి

చిల్లబండ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద మురుగు తిష్ట వేయటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోని మురుగు రహదారిపై పారుతోంది. సీసీ దారి ఉన్నా మట్టి, బురదతో కనుమరుగైంది. దీంతో దుర్వాసన



వెదజల్లుతూ.. దోమలకు ఆవాసాలుగా మారాయి. సర్పంచి ఇంటికి సమీపంలోనే అపరిశుభ్రంగా ఉండటంతో సీసీ దారిపై పేరుకుపోయిన మట్టిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం

కదిలిన వలస బండి

దసరా పండగ ముగియడంతో వలస బండి కదిలింది. మండలంలోని చిర్తనకల్ గ్రామాల ప్రజలు పిల్లాపాపలతో మూటాముల్లె సర్దుకొని వలస వెళ్తున్నారు. గ్రామానికి చెందిన దాదాపు 50 కుటుంబాలు



రెండు బొలెరో వాహనాల్లో కర్ణాటక రాష్ట్రానికి సోమవారం వలస వెళ్లారు. స్థానికంగా ఉపాధి పనులు లేకపోవడంతో పొట్టకూటి కోసం చేసేదేమీ లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నట్లు కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఉపాధి పనులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కోసిగి

ఖాళీ స్థలాలు.. అపరిశుభ్రతకు నిలయాలు

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు నగరపంచాయతీలోని శివారు కాలనీల్లో నివసించే ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నా.. వీటిని పట్టించుకోవాల్సిన మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు చాలా మంది ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఆయా స్థలాల్లో ఇటీవల కురుస్తున్న వర్షాలకు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. పొదల్లో విష సర్పాలు సంచరిస్తూ ఇళ్లలోకి వస్తున్నాయని కాలనీ ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. పడమర, తూర్పు బీసీ కాలనీలు, సంజీవయ్య నగర్, కొత్తగేరి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం సమీపంలో ఖాళీ స్థలాలు దర్శనమిస్తున్నాయి. ఈ స్థలాల్లో చెత్త చెదారం పేరుకుపోవడంతో పాటు మురుగు నీళ్లు చేరి పందులు, దోమలకు ఆవాసాలుగా మారాయి.

వార్డులు: 20; ప్లాట్లు: 5వేలు; జనాభా: 25 వేలు
ఖాళీ స్థలాలు: సుమారు 1247



బీసీ కాలనీలో పెరిగిన చెట్లు

పట్టించుకునే వారు లేక..

మున్సిపాలిటీలోని ఖాళీ స్థలాలకు వీఎల్‌టీ పన్నులు చెల్లించాలి. నిర్మాణాలు చేపట్టకపోయిన ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత స్థల యజమానులదే. స్థలాలను అపరిశుభ్రంగా ఉంచితే చుట్టూ పక్కల వారికి ఇబ్బందులు తలెత్తినప్పుడు అధికారులు ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వాలి. స్పందించకపోతే అధికారులే శుభ్రం చేయించి అయిన ఖర్చును యజమానుల నుంచి వసూలు చేయాలి. కానీ గూడూరు నగర పంచాయతీలో ఇలాంటి ప్రక్రియను చేపట్టడం లేదు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



పడమర బీసీ కాలనీలోని దారి

దారులు అధ్వానం..

ఆయా కాలనీల్లో నేటికి మట్టిదారులపైనే రాకపోకలు సాగుతున్నాయి. కనీసం కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగు నీరు మట్టిదారులపై ప్రవహిస్తోంది. మరి కొన్ని ప్రదేశాల్లో ఖాళీ స్థలాల్లో చేరుతోంది. వర్షం నీరు దారులపై నిలిచి బురదమయంగా మారుతున్నాయి. పిల్లలు, వృద్ధులు నడవటానికి అవస్థలు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో నాయకులకు పలుమార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. కూటమి ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

స్పందించడం లేదు –నూర్జహాన్, గూడూరు

అధికారులకు, స్థానిక ప్రజాపతినిధులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఖాళీ స్థలాల్లో మురుగు నిలిచి కంప చెట్లు దట్టంగా పెరిగాయి. పందులు, దోమలు, విష పురుగులకు నిలయాలుగా మారాయి. చీకటిలో బయటికి రావాలంటే భయంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు మా సమస్యను పరిష్కరించాలి.

చర్యలు తీసుకుంటాం –నాగరాజు, కమిషనర్

ఖాళీ స్థలాల్లో పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటాం. మురుగు సజావుగా పారేందుకు కాలువలు శుభ్రం చేయిస్తాం. సీసీ రోడ్లు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, నూనె, ఇతర వస్తువులను తక్షణమే పంపిణీ చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం పురపాలక కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బాలరారజు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించలేదని మండిపడ్డారు. కార్మికులను రెగ్యులర్ చేసి ఇచ్చిన హామీలను ప్రభుత్వం నేరవేర్చాలని కోరారు. నాయకులు బాబు, దివాకర్, అశోక్‌రాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలో ఈ నెల 16వ తేదీ నుంచి సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతున్నట్లు తహసీల్దారు కుమారస్వామి తెలిపారు. ఎన్నికల కోసం అవసరమయ్యే ఓటర్ల జాబితాలపై నీటిపారుదలశాఖ అధికారులతో చర్చించినట్లు సోమవారం చెప్పారు. మండలంలో గాజులదిన్నె జలాశయం పరిధిలో ఐదు డిస్ట్రిబ్యూటర్ల కింద ఏడు, తుంగభద్ర దిగువకాల్వ పరిధిలో మూడు డిస్ట్రిబ్యూటర్ల కింద ఆరు గ్రామాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో ఆయకట్టు రైతుల జాబితాలను సిద్ధం చేయాలని వీర్వోలకు సూచించారు.

అర్జీలపై విచారణ

సుంకేశ్వరి (మంత్రాలయం), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూ సమస్యలపై వచ్చిన అర్జీలపై తహసీల్దారు విచారణ చేపట్టారు. సోమవారం సుంకేశ్వరి గ్రామంలో సర్వే నంబర్ 151లో 5.46 ఎకరాల వ్యవసాయ భూమిపై వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మాధవరంలోని సర్వే నంబర్ 542-ఏ రస్తా సమస్యపై విచారణ చేశారు. వీఆర్వో ఆనంద్, సర్వేయర్ తిమ్మేష్, రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

సి.బెళగల్, న్యూసుటుడే: సి.బెళగల్‌లో పడమటి కొండల్లో ఉన్న 362 సర్వే నంబరులో పొలం వివాస్పదం ఉంది. సోమవారం జిల్లా గనులశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు తహసీల్దారు, గనులశాఖ అధికారులు, మండల సర్వేయరు నాగభూషణం, వీఆర్వో వెంకటేశ్వర్లు గ్రామంలో పర్యటించారు.



పెద్దకడబూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాలు

ప్రజా సంఘాల నిరసన ర్యాలీ

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత మహిళ గోవిందమ్మ ఎమ్మిగనూరు పట్టణంలో గత 13 రోజుల నుంచి నిర్వహిస్తున్న నిరాహార దీక్షకు మద్దతుగా వివిధ ప్రజా సంఘాలు సోమవారం పెద్దకడబూరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. కల్లుకుంట, మేకడోన, హెచ్. మురవణి, కంబళదిన్నె, జాలవాడి, చిన్నతుంబళం, బసలదొడ్డి, నాగులాపురం, పెద్దకడబూరు నుంచి అధిక సంఖ్యలో దళితులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత మహిళలపై జరిగిన దాడిలో న్యాయం చేయాలని ప్రజా సంఘాలు, బాధితులు దీక్షలు చేపట్టారు. సోమవారం 13వ రోజుకు దీక్ష చేరుకుంది. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. గోవిందమ్మపై జరిగిన దాడి కేసులో మరికొంత మందిపై కేసులు నమోదు చేయాలని డిమాండు చేశారు.

కర్నూలు

• కర్నూలు • పాణ్యం

ఉల్లి క్వింటాలు రూ.4,008

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పంట ఉత్పత్తుల ధరల వివరాలు ఇలా ఉన్నాయి. మార్కెట్‌కు 4,109 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాగా క్వింటాలు కనిష్ఠ ధర రూ. 495, మధ్యధర రూ. 3,649, గరిష్ఠ ధర రూ. 4,008 ధర పలికింది. వేరుశనగకాయలు క్వింటాల్ గరిష్ఠ ధర రూ. 6,659, పూల విత్తనాలు రూ. 5,609, ఆముదాలు రూ. 5,980, మొక్కజొన్న రూ. 2,261, కందులు రూ. 9,100, శనగలు రూ. 5,090, ఎండు మిర్చి రూ. 9,299, కొర్రలు రూ. 3,741, మినుములు రూ. 7,598, సోయాబీన్స్ 3,911, సజ్జలు రూ. 2,081 లకు వ్యాపారులు ఈ-నామ్ ద్వారా కొనుగోలు చేశారు.

నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన శనగ విత్తనాలు రాయితీ ధరపై సరఫరా చేయాలని జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కోరారు. సోమవారం జడ్పీలోని తన ఛాంబరులో మాట్లాడారు. అక్టోబరు 15 తేదీ వస్తున్నా.. శనగ విత్తనాల పంపిణీ చేయడంలేదని, ఆలస్యమవుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: సమస్య: సీ.క్యాంపులోని వీధుల్లో ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. దీంతో చెత్త పేరుకుపోతోంది.

- స్థానికులు

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కరిస్తాం.

- నగరపాలక అధికారులు

సంక్షిప్త సమాచారం

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: 19వ వార్డు పరిధిలోని బీడీ వర్కర్స్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆవాజ్ కమిటీ ప్రతినిధులు కోరారు. సోమవారం నగరపాలక కమిషనర్ రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎండీ షరీఫ్, షేక్ అబ్దుల్, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కల్లూరు మండల పరిధి ఉలిందకొండ గ్రామంలో సోమవారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశాచల్‌రెడ్డి, తెదేపా నాయకులు రామాంజనేయులు, ఈవీ రమణ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: దూపాడు సమీపంలోని ఓ ప్రైవేటు ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో రెండున్నర తులాల బంగారం, వెండి అపహరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉలిందకొండ పోలీసు స్టేషన్ ఎస్సై ధనుంజయ వెల్లడించారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఇన్‌ఛార్జి ట్యాప్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాముడుకు ఎస్ఈ రాజశేఖర్ సోమవారం మెమో జారీ చేశారు. తాగునీటి సరఫరాపై విధులు నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు మెమో జారీ చేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

త్వరలో భవనాలు ప్రారంభిస్తాం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: క్లస్టర్ వర్సిటీ పరిధిలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్లు ప్రిన్సిపల్ ఇందిరాశాంతి తెలిపారు. ఆమె సోమవారం మాట్లాడుతూ రూసా కింద వచ్చిన నిధులతో పరిపాలన భవనం, గ్రంథాలయం, క్యాంటీన్, బాలికల వసతిగృహ భవనాలు నిర్మించినట్లు పేర్కొన్నారు. వీటిని త్వరలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతులమీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.

కొరత లేకుండా చూడాలని వినతి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పెంటా వ్యాక్సిన్ కొరత లేకుండా చూడాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ ఆధ్వర్యంలో సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయ పర్యవేక్షకుడు శ్రీనివాసులును కలిసి వినతి పత్రం ఇచ్చారు. సమస్య పరిష్కరించాలని వైద్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు రాఘవేంద్ర, అబ్దుల్లా తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: నగరంలో ఉదయం 10-30 నుంచి 11-30గంటల మధ్యలో, కర్నూలు రూరల్ గ్రామాల్లో ఉదయం 9 నుంచి 11గంటల మధ్యలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి తెలిపారు. కర్నూలు డివిజన్‌లో డీ2సెక్షన్ పరిధిలో గణేష్‌నగర్, రామచంద్రమిషన్, రెవెన్యూకాలనీ, సీ.క్యాంపు ప్రాంతం, శ్రీరామనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు డీ2సెక్షన్ ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. రూరల్ ప్రాంతంలో పంచలింగాల 33కేవీ ఫీడర్‌లో పనుల నిమిత్తం పంచలింగాల, గొందిపర్ల, ఇ.తాంత్రపాడు దేవమాడ, పంచలింగాల స్కంద తదితర ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు రూరల్ ఏడీఈ సుబ్బన్న వివరించారు. వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించిన 3ఫేస్ సరఫరాను ఉదయం 5 నుంచి 11గంటల వరకు, 11నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు అందించనున్నట్లు తెలిపారు. రైతులు, పారిశ్రామిక వేత్తలు ఈ విషయాన్ని గమనించి..సహకరించాలని ఆయన కోరారు.

6నెలల బాలుడికి అరుదైన శస్త్రచికిత్స

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లాకు చెందిన ఆరు నెలల బాలుడికి అరుదైన శస్త్రచికిత్సతో కిడ్నీలో రాళ్లు తొలగించి ప్రాణాలు కాపాడినట్లు కిమ్స్ ఆసుపత్రి యూరాలజిస్టు డాక్టర్ మనోజ్‌కుమార్ తెలిపారు. శస్త్రచికిత్స గురించి సోమవారం వివరించారు. నంద్యాల జిల్లా పాణ్యంకు చెందిన దీక్షిత్ అనే ఆరు నెలల బాలుడు ఈ నెల 5న కడుపు నొప్పితో కిమ్స్‌లో చేరాడు. పరీక్షలు చేయగా కిడ్నీలో రాళ్లు ఉన్నాయని గుర్తించారు. కిడ్నీరాళ్లు 9మి.మీ., 11 మి.మీ. రాళ్లను ఎండోస్కోపిద్వారా లేజర్ చికిత్స ద్వారా తొలగించామన్నారు.

సమాచారం అందించండి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: రాయలసీమకు తుపాను హెచ్చరిక జారీ అయిన సందర్భంగా కర్నూలు నగరం విద్యుత్తు వినియోగదారులు జాగ్రత్తలు వహించాలని కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. తుపాను కారణంగా తీగలు తెగడం, చెట్లు విరగడం, స్తంభాలు వరగడం తదితర విద్యుత్తు సమస్యలు ఏర్పడినపుడు తక్షణమే సంబంధిత విద్యుత్తు అధికారులకు, సిబ్బందితో పాటు.. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నెంబరు 08518-221919కు సమాచారం అందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్తుకు సంబంధించిన ఏవేని సమస్యలపై తక్షణమే 1912 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

నేడు సంఘం నూతన అధ్యక్షుడి ఎన్నిక

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కలెక్టరేట్ ఆవరణలోని రెవెన్యూ పొదుపు భవన్‌లో రెవెన్యూ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జరగనుంది. కర్నూలు, ఆదోని, పత్తికొండ రెవెన్యూ డివిజన్లు, కలెక్టరేట్ యూనిట్ కార్యవర్గాలు కలిసి నూతన అధ్యక్షుడిని ఎన్నుకోనున్నాయి.

అథ్లెటిక్స్ బరి.. గెలుపుపైనే గురి

☛ రాణిస్తున్న గ్రామీణ క్రీడాకారులు

గ్రామీణ యువ క్రీడాకారిణులు అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై మక్కువ పెంచుకొన్న వారు నచ్చిన అథ్లెటిక్స్ ఈవెంట్‌లో సాధన చేస్తూ.. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ బరిలో విజయం సాధించి.. జాతీయ స్థాయి పోటీలపై గురిపెట్టారు.

-న్యూస్‌టుడే, కర్నూలు క్రీడలు(బి.క్యాంపు)

పతకాలతో మైత్రి



మైత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ పొలిటికల్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. స్వగ్రామం డోన్. ఉన్నత చదువుల నిమిత్తం కర్నూలుకు వచ్చి వసతిగృహంలో ఉంటూ చదువుతున్నారు. తల్లిదండ్రులు లక్ష్మీదేవి, మధు. తండ్రి కూలిపని చేస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నారు. మైత్రి అక్టోబరు 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో హైజంప్‌లో స్వర్ణ పతకం, 4*100 రిలే వెండి పతకం సాధించారు.

రోజూ సాధనతో..

మైత్రి 2023 సెప్టెంబరు 13 నుంచి 15వ తేదీ వరకు గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ దక్షిణ మండలం పోటీల్లో హైజంప్‌లో వెండి పతకం సాధించారు. 2022 ఆగస్టులో గుంటూరులో రాష్ట్రస్థాయి అండర్-18 అథ్లెటిక్స్ పోటీల్లో హైజంప్ వెండి పతకం, అదే ఏడాది అక్టోబరులో ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-18 విభాగంలో హైజంప్‌లో కాంస్య పతకం సాధించారు. 2022 జనవరిలో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయిలో అథ్లెటిక్స్ విభాగంలో అండర్-19 ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో హైజంప్‌లో వెండి పతకం అందుకున్నారు. 2022 మేలో భూపాల్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించారు. ఆర్‌యూ అంతర్ కళాశాల పోటీల్లో రాణించేందుకు బి.క్యాంపు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలో రోజూ పర్యవేక్షణలో సాధన చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

విజయాల సుకన్య



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు సుకన్య. స్వగ్రామం ప్యాలకుర్తి. తల్లిదండ్రులు గంగావతి, ఎల్లప్పను ఒప్పించి ఉన్నత చదువు కోసం కర్నూలుకు వచ్చారు. వ్యవసాయం చేసుకుంటూనే కుమార్తెను చదివిస్తున్నారు. అక్టోబరు 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో హెప్టథ్లిన్ (షాట్‌పుట్, జావెలింగ్, లాంగ్‌జంప్, హైజంప్, హర్డిల్స్, 800, 200 మీటర్ల పరుగు, డిస్కస్‌త్రో) స్వర్ణం, 400 మీటర్ల రిలే వెండి, హర్డిల్స్‌లో కాంస్య పతకం అందుకున్నారు.

పోటాపోటీగా..

2023 సెప్టెంబర్‌లో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ దక్షిణ మండలం పోటీల్లో హెథాలిన్ కాంస్య పతకం సాధించారు. 2022 ఆగస్టులో గుంటూరులో రాష్ట్రస్థాయి అండర్-18 అథ్లెటిక్స్ పోటీల్లో హైజంప్‌లో వెండి, అదే ఏడాది అక్టోబరులో ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-18 విభాగంలో హైథలిన్ వెండి పతకం అందుకున్నారు. 2022 జనవరిలో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయిలో అథ్లెటిక్స్ విభాగంలో అండర్-19 ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో 4* 100 రిలే కాంస్య పతకం అందుకున్నారు. దక్షిణ మండలం అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో పాల్గొనేందుకు శిక్షకుడు హర్షవర్ధన్ పర్యవేక్షణలో శిక్షణ తీసుకుంటున్నానని సుకన్య వివరించారు.

శ్రీచక్రానికి జలాభిషేకం



కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: కర్నూలులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం కలశ ఉద్వాసన పూజలు జరిగాయి. దేవీ శరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా 108 కలశాలతో మహిళలు మహా గౌరి సన్నిధిలో శ్రీచక్రానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణం కుంకుమార్చన చేశారు. భక్తులకు ప్రసాదవితరణ చేశారు. దేవాలయ ట్రస్టు ఛైర్మన్ శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

కార్యదర్శులను ఆరోగ్యశాఖకు బదలాయించాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: ఆరోగ్య కార్యదర్శులను మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో విలీనం చేయాలని యునైటెడ్ విలేజ్, వార్డ్ హెల్త్ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆరోగ్య కార్యదర్శులను వైద్య ఆరోగ్య



ఆందోళన చేస్తున్న సంఘం నాయకులు

శాఖకు బదలాయించాలని కోరుతూ యునైటెడ్ విలేజ్, వార్డ్ హెల్త్ కార్యదర్శుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన ఆందోళన కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సంధ్యారాణి, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.డి. అంజిబాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ న్యూ సిటీ కార్యదర్శి సీహెచ్.సాయిబాబు, జిల్లా నాయకులు వరలక్ష్మీదేవి, మాన్విత, శంషాద్, సరోజమ్మ, మేరి, హేమావతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు ప్లాట్‌ఫాం వద్ద నిలిచిన ప్రయాణికులు



బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

తిరుగు ప్రయాణంలో కష్టాలు

పండగ పూర్తయింది.. సెలవులు ముగిశాయి.. పాఠశాలలు, కళాశాలలు మొదలయ్యాయి. గ్రామాల నుంచి పట్టణ కేంద్రాలకు, ఇతర నగరాలకు తిరుగు ప్రయాణమవుతున్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేశామని ప్రజా రవాణా అధికారులు చెప్పారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. తెలంగాణ, ఆత్మకూరు, సెక్టార్ల వద్ద బస్సుల కోసం ప్రయాణికులకు గంటల తరబడి నిరీక్షణ తప్పలేదు, సీటు పట్టేందుకు ప్రయాణికులు సైతం ఇక్కట్లు పడ్డారు.

– న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు



సీటు పట్టేందుకు ప్రయత్నాలు

సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

కర్నూలు క్రీడలు(బి.క్యాంపు), న్యూస్‌టుడే: డీఎస్ఏ స్టేడియంలో ఈ నెల 15వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి సీనియర్ పురుషులు, స్త్రీలకు జిల్లా స్థాయి సెపక్‌తక్రా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి జి. శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు 22 నుంచి 23వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

సీఐ దాడి వీడియో చక్కర్లు

కర్నూలు నేరవిభాగం: కర్నూలులో ఓ వ్యక్తి వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. ఈనెల 13వ తేదీన దుర్గామాత నిమజ్జన కార్యక్రమం జరిగిన సంగతి విదితమే. లక్ష్మీనగర్ వద్ద తన ఓ సీఐ కొట్టాడంటూ బాధపడుతూ గాయంతో ఉన్న ఓ వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకుని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఆవీడియో కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

తల్లిదండ్రుల చెంతకు చిన్నారులు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులో అదృశ్యమైన ఇద్దరు పిల్లల అపహరణ ఉదంతం మూడు గంటల్లో సుఖాంతమైంది. స్థానిక మారుతీ మెగాసిటీ శ్రీనిధి అపార్ట్‌మెంట్‌లో ఉండే అభినవ్‌రెడ్డి(6), హరిచరణ్(5) అపార్ట్‌మెంట్ ఆవరణలో ఆడుకుంటూ రూ. 10 జామకాయలు కొనుక్కునేందుకు బయటకు వెళ్లారు. వీరి తండ్రి కార్యాలయాలకు వెళ్లగా తల్లి ఇంట్లో పనిలో నిమగ్నం కావటంతో ఎవరూ గమనించలేదు. కొద్ది సేపటికి పిల్లలు కనించకపోవటంతో వారు ఆందోళన చెందారు. కర్నూలు మూడో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ మురళీధర్‌రెడ్డి ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. వారు అప్రమత్తమై అందరి వాట్సాప్‌లకు పంపారు. ఆటోడ్రైవర్లు ఉపేంద్రనాయక్, బుజ్జీ, బాలరాజుకు ఆ సమాచారం అందింది. ఆరోరానగర్ జమ్మిచెట్టు వద్ద ఇద్దరు పిల్లలను గుర్తించి పోలీసులకు అప్పగించారు. సీఐ, సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు ఆటోడ్రైవర్లను అభినందించి సత్కరించారు. ఎస్పీ జి.బిందుమాధవ్ వారిని అభినందించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తం ఉండాలని, వారి జేబుల్లో తల్లిదండ్రుల ఫోన్ నెంబర్ల చీటీలు ఉంచాలని సూచించారు.



తస్కరించిన ఆటోడ్రైవర్లతో సీఐ మురళీధర్‌రెడ్డి

పారని నీరు.. సాగని రాకపోకలు



కర్నూలు నుంచి రామచంద్ర నగర్ మీదుగా సుమారు 15 కాలనీల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం వాకింగ్, పనుల నిమిత్తం, దిన్నెదేవరపాడుకు నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. 15 రోజుల కిందట కురిసిన వర్షాలకు రహదారి గోతుల మయంగా మారింది. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారి మరమ్మతులు చేపట్టాలని కర్నూలు, దిన్నెదేవర పాడు గ్రామ ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

రహదారిపై గుంత.. తీరని చింత

నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని నంది కొట్కూరు రోడ్డులో గుంత ఏర్పడింది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. రహదారికి మరమ్మతులు చేయాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలకసంస్థ





వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఓర్వకల్లు న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి సూచించారు. ఓర్వకల్లు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల నుంచి సోమవారం పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. అనంతరం రూ. 54 లక్షల విలువైన ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దారు విద్యాసాగర్, తెదేపా మండల కన్వీనర్ గోవిందరెడ్డి, తెదేపా సీనియర్ నాయకులు విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మికాంతారెడ్డి, మాజీ ఎంపీటీసీ అన్వర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

డీఐజీని కలిసిన విష్ణు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: తెదేపా కోడుమూరు నియోజకవర్గం బాధ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం స్థానిక బీ.క్యాంపులో కర్నూలు రేంజ్‌డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.



డీఐజీని సత్కరిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

తండ్రీకుమారులపై కేసు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులోని శరీన్‌నగర్‌కు చెందిన ఎరుకలి కుమార్, ఇతని కుమారులు బబ్లూ, వంశీ మరికొందరిపై కర్నూలు నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. అదే కాలనీకి చెందిన రామాంజనేయులుపై నిందితుడు దాడి చేసి గాయపరిచటంతో బాధితుడు ఆదివారం పోలీసుస్టేషన్ ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

బ్లేడుతో గొంతుకోసుకొని..

ఓర్వకల్లు న్యూస్‌టుడే: మండలంలోని హుసేనాపురంలో ఓ వ్యక్తి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పోలీసులకు సమాచారం అందడంతో ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. మిడుతూరు మండలం నాగలూటికి చెందిన రామాంజనేయులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. జీవితంపై విరక్తిం చెంది బ్లేడుతో గొంతు కోసుకుంటుండగా.. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడిని ప్రాణాపాయం నుంచి తప్పించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పనుల్లో జాప్యం.. నాణ్యత లోపం

☛ అసంపూర్తిగా సీసీ రహదారుల నిర్మాణం ☛ అధికారుల పర్యవేక్షణ కరవు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నగరంలో పలు అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. సీసీ రహదారులు, మురుగునీటి కాలువ నిర్మాణాలు నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో స్థానికంగా ఉండే కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు. వీటితో పాటు నగరంలో కూడళ్ల నిర్మాణ పనులు కూడా నెలలుగా నిలిచిపోయాయి.

కనిపించని పురోగతి

కర్నూలు నగరంలో 52 వార్డులు సుమారు 6.5 లక్షల జనాభా ఉంది. ప్రస్తుతం నగరంలో సుమారు రూ. 20 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నారు. సుమారు 60 పనులు జరుగుతున్నట్లు సమాచారం. ఇందులో సగం వాటికిపైగా పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. ఆశించిన మేర పురోగతి కానరావడం లేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారులు పనులను పర్యవేక్షించడం లేదని సమాచారం. మురుగు కాలువలు, సీసీ రహదారుల పనులను ఇష్టానుసారంగా చేస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. మురుగునీటి కాలువలను సైతం వంకటింకరగా వేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మొక్కుబడి పరీక్షలు

గత వైకాపా ప్రభుత్వ హయంలో సుమారు రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. చాలా కాలనీల్లో సీసీ రహదారులు, మురుగునీటి కాలువలు నిర్మించారు. నగరపాలక ఓ థర్డ్ పార్టీ ఏజెన్సీకి నాణ్యత ప్రమాణాలు పరీక్షించి నివేదికలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకుంది. నగరపాలక సంస్థ పరిధిలో వివిధ పనులు నిర్వహించిన తర్వాత నాణ్యత ప్రమాణాలు ఏమేర పాటించారో తెలిపే పత్రం అందజేస్తే అధికారులు పరిశీలించి గుత్తేదారులకు బిల్లులు మంజూరు చేస్తారు. చాలా పనుల్లో నాణ్యత ప్రమాణాలు పరిశీలించకుండానే బిల్లులు మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. సీసీ రహదారుల మధ్యలో రంధ్రాలు పెట్టి కాంక్రీటు తీసుకొని నాణ్యత ప్రమాణాలు పరీక్షించాలి. నమూనాలు సేకరించిన దాఖలు లేవు. ప్రజాధనం దోచేసుకున్నారు. ప్రస్తుతం చాలా కాలనీల్లో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల పనులు చేపట్టారు. అందులో సైతం నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



గుత్తిరోడ్డు శ్రీరామకాలనీలోని రహదారి ఇది. కొన్ని రోజుల కిందట రహదారి వేసేందుకు తవ్వారు. నేటికీ పనులు ప్రారంభించలేదు. స్థానికంగా ఉండే కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నడిచేందుకు కూడా వీల్లేకుండా పోయింది. చిన్నపాటి వర్షానికి రహదారి బురదమయం కావడంతో చిన్నపిల్లలు, వృద్ధులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని.. పనులు త్వరగా పూర్తిచేయాలని కోరుతున్నారు.

ఇక్కడా అదే పరిస్థితి

☛ కల్లూరు పట్టణ పరిధి 31వ వార్డులో మురుగునీటి కాలువల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులు నత్తనడకన సాగుతున్నాయి. గుత్తేదారులు పనులను త్వరగా పూర్తి చేయకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

☛ కర్నూలు నగరంలో పలు కూడళ్ల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. నెలల తరబడి పనులను ప్రారంభించలేదు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. పనులు పూర్తిచేయాలని పురవాసులు కోరుతున్నారు.

లారీడ్రైవర్ ఆత్మహత్య



పార్థుడు (పాత చిత్రం)

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా గోస్పాడు మండలం యాల్లూరుకు చెందిన ఆళ్లగడ్డ పార్థుడు(32) సోమవారం కర్నూలులో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లిదండ్రులు లేరు. చిన్నప్పుడే చనిపోవటంతో అతని పెద్దనాన్న వెంకటస్వామి ఆదరించారు. ఒక సోదరుడు, ఒక సోదరి ఉన్నారు. ఆళ్లగడ్డ పార్థుడు గతకొంతకాలంగా కర్నూలులో కల్లూరు మారుతీనగర్‌లో ఉంటూ లారీడ్రైవర్‌గా పనిచేసేవాడు. తన బంధువైన ఓ మహిళను ప్రేమించాడు. ఆమె ఇతని ప్రేమను నిరాకరించటంతో సోమవారం తెల్లవారుజామున ఇంట్లో పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలుక సాయంత్రం మృతి చెందారు. మృతుడి సోదరుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కర్నూలు నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.